www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
ఆదివారం
04-08-2024
సంపుటి : 01 । సంచిక : 92 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD

## ప్రపంచ ఆహార భద్రతకు భారత్ కృషి

- 2024- 25 బడ్జెట్లో సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించాం
- భారత్ లో సమృద్ధిగా ఆహార నిల్వలు
- ఐసీఏఈ సదస్సులో ప్రధాని మోదీ


2

## ప్రజల వద్దకే న్యాయం

- అందించాలనే ముఖ్య ఉద్దేశమే లోక్ అదాలత్ లు
- ప్రజలు సత్వర పరిష్కారాలు కోరుకుంటున్నారు
- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డి.వై.చంద్రచూడ్


**ఢిల్లీ:** ప్రజలు సెటిల్మెంట్ ద్వారా సత్వర పరిష్కారాలు కోరుకుంటున్నారని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ పేర్కొన్నారు. సర్వోన్నత న్యాయస్థానంలో వారం రోజుల పాటు ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన విషయం విదితమే. కాగా, ప్రత్యేక లోక్అదాలత్ చివరిరోజున ఆయన మాట్లాడారు. మిగతా2లో...



## దేశంలో 8 కొత్త జాతీయ రహదారులు

రూ.50,655కోట్ల అంచనా వ్యయం..

కేంద్ర మంత్రివర్గ సమావేశం గ్రీన్ సిగ్నల్


2

## అక్టోబర్ 4 నుంచి తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు

అధికారులతో టీటీడీ అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య సమీక్ష


10

## నాగార్జున సాగర్ 4.94లక్షల క్యూసెక్కుల భారీ వరద



తెలంగాణ రాష్ట్రంలో రెప్పపాటు కరెంటు కూడా పోకుండా ప్రజలకు కరెంటు ఇవ్వాలని మా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో ట్రిప్ అయితే కరెంటు ఇచ్చేవాళ్ళు కాదు.. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్ధరాత్రి ఫిర్యాదు వస్తే అర్ధరాత్రి కూడా వెళ్లి కరెంటు ఇచ్చే విధంగా కృషి చేస్తున్నాం.. కరెంటు వాడకం పెరిగినప్పటికీ కరెంటును తెప్పించి ప్రజలకు ఇస్తున్నాం.. రాబోయే 10 ఏళ్లకు కూడా అవసరమయ్యే కరెంటుని ఉత్పత్తి చేస్తున్నాం.. పొల్యూషన్ లేని విద్యుత్ ఉత్పాదనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.శనివారం నాడు ఖమ్మం జిల్లాలో పర్యటనలో ఆయన మాట్లాడారు.



# రెప్పపాటు కూడా కరెంట్ పోదు

## కాలుష్యం లేని విద్యుత్ ఉత్పాదనపై ప్రభుత్వం దృష్టి

- రాబోయే 10 ఏళ్లకు కూడా అవసరమయ్యే కరెంటుని ఉత్పత్తి చేస్తున్నాం
- రైతులకు రూ.2లక్షల లోపు రుణమాఫీ
- అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులను అందజేస్తాం

**విశ్వంభర హైదరాబాద్ :**

త్వరలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. అర్హత ఉన్నవారందరికీ ఇస్తామని హామీ ఇచ్చారు. శనివారం నాడు ఖమ్మం జిల్లాలో పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతు రుణమాఫీతో దేశ చరిత్రలోనే తెలంగాణ రికార్డ్ సృష్టించిందన్నారు. లక్ష్యానికి అనుగుణంగా అందరికీ మాఫీ చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో రూ.2 లక్షల లోపు రుణమాఫీ కూడా చేస్తామన్నారు.తెలంగాణలో రెప్పపాటు సమయం కూడా కరెంట్ పోకుండా ఇవ్వాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. గతంలో ట్రిప్ అయితే కరెంట్ ఇచ్చేవాళ్లు కాదని... తమ ప్రభుత్వంలో అర్ధరాత్రి ఫిర్యాదు వచ్చినా వెళ్లి కరెంట్ ఇచ్చేవిధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రకృతి వైపరీత్యం, లైన్ మెయింటెనెన్స్ సమయంలో తప్ప కరెంట్ పోవడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల కరెంట్ పోయినా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్ మిగతా2లో...


2

## మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తిచేయాలి

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

ఈ ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు

జిల్లా కలెక్టర్లతో పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్


11

## సెమీఫైనల్‌కు చేరిన లక్ష్యసేన్!

ఒలింపిక్స్‌లో చరిత్ర సృష్టించిన భారత షట్లర్..

తైవాన్‌కు చెందిన 12వ సీడ్ చోచెన్‌పై విజయం

## బ్యాంక్ అకౌంట్‌కు ఇక నలుగురు నామినీలు

- బ్యాంకింగ్ చట్టానికి సవరణ
- దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో రూ.78 వేల కోట్ల క్లెయిమ్ చేయని డిపాజిట్లు
- సమస్యకు పరిష్కారం చూపించేలా త్వరలో కేంద్ర ప్రభుత్వం బిల్లు


2


## అమెరికాకు సీఎం రేవంత్

నేటి నుంచి ఈనెల 13వరకు పర్యటన

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## నిర్వీర్యమైన వ్యవస్థలను 100రోజుల్లో గాడిలో పెడతాం



- భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ఏపీ సీఎం చంద్రబాబు

**విశ్వంభర,మంగళగిరి:** అక్రమాలకు పాల్పడిన అధికారులను వదిలేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖను నిర్వీర్యం చేశారని ఏపీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. మంగళగరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు మిగతా2లో...



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
| --- | --- |
| ₹ 80 | ₹ 102 |
| స్కిన్ | స్కిన్ లెస్ |
| ₹ 148 | ₹ 168 |

## ప్రముఖ నాట్యకారిణి యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

నాట్యరంగానికి పూర్తి జీవితం అంకితం..

భారతీయ నృత్య కళాకారిణి యామినీ కృష్ణమూర్తి (స్మృతిలో)


2



# మూసీ నది ప్రక్షాళనలో ముందడుగు

హైదరాబాద్ మహానగరంలో మురికికూపంగా మారిన మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆ దిశగా ముందడుగు వేసింది. మూసీకి పునర్జీవం వచ్చేలా నదిని శుద్ధి చేసేందుకు కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మించనుంది. ఇందుకోసం జలమండలికి పరిపాలన అనుమతులిస్తూ రూ.3,849.10 కోట్లను కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్టీపీల నిర్మాణానికి రూ.3,849 కోట్లు

పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ ఉత్తర్వులు జారీ

9

విశ్వంభర
V3 NEWS

## ప్రపంచ ఆహార భద్రతకు భారత్ కృషి

**ఢిల్లీ:** ఆహార నిల్వలు భారత్లో సమృద్ధిగా ఉన్నాయని, ప్రపంచ ఆహార భద్రతకు దేశం కృషి చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలో నిర్వహిస్తున్న 32వ ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చర్ ఎకనామిక్స్ (ఐసీఏఈ) సదస్సుని శనివారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. కేంద్రం ప్రవేశపెట్టిన 2024- 25 బడ్జెట్లో సుస్థిర వ్యవసాయంపై దృష్టి సారించామన్నారుప్రస్తుతం పాలు, పప్పుదినుసులు, సుగంధ ద్రవ్యాల ఉత్పత్తిలో దేశం ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. ఆహారధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పత్తి, చక్కెర, తేయాకు పంటల్లో రెండో అతిపెద్ద ఉత్పత్తిదారుగా అవతరించిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహార, పౌష్టికార భద్రతకు పరిష్కారాలు చూపేందుకు భారత్ పనిచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రసాయన రహిత, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ఓ దశలో భారత్ ఆహార భద్రత విషయంలో ప్రపంచం ఆందోళన చెందినదని, కానీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆహారభద్రత, పౌష్టికార భద్రతకు సంబంధించిన సమస్యలకు పరిష్కారాలు ఇస్తోందని మోదీ చెప్పారు.గతంలో ఇండియాలో ఈ సమావేశాన్ని నిర్వహించినప్పుడు, అప్పుడే భారత్ స్వతంత్ర్యాన్ని సాధించిందని, ఆ సమయంలో దేశం వ్యవసాయ, ఆహార భద్రత సవాళ్లను ఎదుర్కొన్నదన్నారు. పెట్రోల్లో 20 శాతం ఇథనాల్ను కలిపి వినియోగించాలనే లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. భారత్ గత 10 ఏళ్లలో వాతావరణ పరిస్థితులు తట్టుకునే 1,900 కొత్త వంగడాలను మన వ్యవసాయ శాస్త్రవేత్తలు రూపొందించినట్టు తెలిపారు. కెమికల్ ఫ్రీ నేచురల్ ఫార్మింగ్ను ఇండియా ప్రమోట్ చేస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సు ఈ నెల 7 వరకు జరుగనుంది. 'సుస్థిర వ్యవసాయం- ఆహార వ్యవస్థల దిశగా పరిమాణం' అనే థీమ్తో ఈ ఏడాది సదస్సు నిర్వహిస్తున్నారు. భారత్లో ఈ సదస్సు 65 ఏళ్ల తర్వాత నిర్వహించడం గమనార్హం. వ్యవసాయ రంగానికి సంబంధించి శాస్త్రవేత్తలు ఆవిష్కరించిన వాటిని ప్రదర్శించనున్నారు. విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల మధ్య భాగస్వామ్యాన్ని బలపరచడమే దీని ముఖ్య ఉద్దేశం.

## ప్రజల వద్దకే న్యాయం

(మొదటి పేజీ తరువాయి)
ఈ లోక్ అదాలత్ ఏర్పాటుకు బార్, బెంచ్ సభ్యులందరి సహకారం లభించిందన్నారు. ఈ లోక్అదాలత్లో న్యాయవాదులను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతోనే ఇద్దరు బార్ సభ్యులతో పాటు ఇద్దరు న్యాయవాదులతో బెంచ్ ఏర్పాటు చేశామన్నారు.ప్రజల వద్దకే న్యాయం అందించాలనే ముఖ్య ఉద్దేశమే లోక్ అదాలత్ లని వివరించారు. సర్వోన్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించింది. పెండింగ్లో ఉన్న కేసులను తగ్గించడమే దీని లక్ష్యం.

### బ్యాంక్ అకౌంట్ కు ఇక నలుగురు నామినీలు

**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా బ్యాంకుల్లో పేరుకుపోతున్న క్లెయిమ్ చేయని డిపాజిట్ల సమస్యకు పరిష్కారం చూపించేలా కేంద్రం బ్యాంకింగ్ చట్టానికి సవరణ చేయబోతోంది. ఈ మేరకు త్వరలో పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెట్టబోతంది. ఇప్పటికే ఈ ఏడాది మార్చి వరకూ దేశంలో రూ.78 వేల కోట్ల క్లెయిమ్ చేయని డిపాజిట్లు బ్యాంకుల్లో మగ్గుతున్నాయి. వీటిని క్లెయిమ్ చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి. దీనికి ప్రధాన కారణం ఒక నామినీయే ఉండటం.ఈ నేపథ్యంలో ఇకపై ఒక్కో బ్యాంక్ అకౌంట్ కూ నలుగురు నామినీలను అనుమతిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు బ్యాంకింగ్ చట్టాల్లో సవరణలు చేస్తూ బిల్లు ప్రవేశపెట్టబోతున్నారు. తద్వారా అన్ క్లెయిమ్డ్ డిపాజిట్లతో పాటు బాండ్లు, డివిడెండ్ల సమస్యకు కూడా పరిష్కారం లభించనుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం బ్యాంకుల్లోని సేవింగ్, ఫిక్సడ్ డిపాజిట్ ఖాతాలకు సైతం ఒక నామినీని మాత్రమే ఉంచే అవకాశం ఉంది. నలుగురు నామినీలను అనుమతించడం ద్వారా వీరిలో ఎవరో ఒకరు ఖాతాదారుడి మరణం తర్వాత డిపాజిట్ మొత్తాల్ని క్లెయిమ్ చేసుకునే అవకాశం లభించనుంది.ప్రస్తుతం పీపీఎఫ్ కు మాత్రమే ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను పెట్టుకునే అవకాశం ఉంది. ఇకపై ఇతర బ్యాంకు ఖాతాలకూ నామినీలను పెట్టుకుంటే క్లెయిమ్ చేయని డిపాజిట్ల సమస్యకు చెక్ పడబోతోంది. దీంతో పాటు బ్యాంకింగ్ వ్యవస్థల్లో మరిన్ని మార్పులకు శ్రీకారం చుట్టేలా కేంద్రం సవరణ బిల్లు తీసుకురానుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఇది అమల్లోకి వస్తే చాలా సమస్యలకు చెక్ పడనుంది.

## అత్యంత ప్రజాధరణ కలిగిన నేతగా నరేంద్రమోదీ

**ఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అగ్రస్థానంలో నిలిచారు. అమెరికాకు చెందిన మార్నింగ్ కన్సల్ట్ అనే సంస్థ సర్వేను నిర్వహించగా.. గ్లోబల్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సంస్థ ర్యాంకింగ్లను విడుదల చేసింది. సర్వేలో 69 శాతం ఓట్లతో భారత ప్రధాని మొదటి స్థానంలో నిలవగా.. మెక్సికో అధ్యక్షుడు లోపెజ్ ఒబ్రేడర్ 63 శాతంతో రెండో స్థానంలో ఉన్నారు.25 మందితో రూపొందిన ఈ జాబితాలో జపాన్ ప్రధాని ఫుమియో కిషిదా చిట్టచివరి స్థానంలో నిలిచారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్కు 39 శాతం జనామోదం లభించింది. గతంలో వెలువడిన సర్వేల్లోనూ ప్రధాని మోదీ ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవడం గమనార్హం. ఈ ఏడాది జులై 8-14 మధ్య ప్రతి దేశంలోనూ ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించి సర్వే సంస్థ ఈ జాబితాను విడుదల చేసింది.

**టాప్ దేశాధినేతలు..**

- భారత ప్రధాని- నరేంద్ర మోదీ (69 శాతం)
- మెక్సికో అధ్యక్షుడు- లోపెజ్ ఒబ్రేడర్ (63)
- అర్జెంటీనా అధ్యక్షుడు- జేవియర్ మిలి (60)
- స్విట్జర్లాండ్ అధ్యక్షుడు వియోల్ అమెర్డ్ (52)
- ఐర్లాండ్ ప్రధాని- సైమన్ హారిస్ (47)
- యూకే ప్రధాని- కీర్ స్టార్మర్ (45)
- పోలాండ్ ప్రధాని- డొనాల్డ్ టస్క్ (45)
- ఆస్ట్రేలియా ప్రధాని- ఆంథోని అల్బనీస్ (42)
- స్పెయిన్ ప్రధాని- పెడ్రో శాంచెజ్ (40)
- ఇటలీ ప్రధాని - జార్జియా మెలోని (40)
- అమెరికా అధ్యక్షుడు- జోబైడెన్ (39)
- కెనడా ప్రధాని- జస్టిన్ ట్రూడో (29)


## సీఎం రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటాం

**విశ్వంభర, హైదరాబాద్:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకమని, ఈ తీర్పును అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటామని ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం హైదరాబాద్లో జరిగిన దళితుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సుప్రీంకోర్టు తీర్పును సీఎం అమలు చేస్తామని చెప్పారని హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 16న లేదా 17న మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమ్మేళనానికి సీఎంను ముఖ్య అతిథిగా పిలుస్తామన్నారు.

## ప్రముఖ నాట్యకారిణీ యామినీ కృష్ణమూర్తి కన్నుమూత

**ఢిల్లీ:** ప్రముఖ భరతనాట్యం, కూచిపూడి నృత్య కళాకారిణి యామినీ కృష్ణమూర్తి (84) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె.. ఢిల్లీలోని అపోలో ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. 1940లో ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. యామినీకి 1968లో పద్మశ్రీ, 2001లో పద్మభూషణ్, 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలతో కేంద్ర ప్రభుత్వం సత్కరించింది. గతంలో తితిదే ఆస్థాన నర్తకిగా కూడా ఆమె సేవలందించారు.

## నిర్వీర్యమైన వ్యవస్థలను 100రోజుల్లో గాడిలో పెడతాం



(మొదటి పేజీ తరువాయి)
స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినతులు అన్నింటిని పరిష్కరించడమే తమ లక్ష్యమన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సమస్యలకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వైసిపి కారణంగా ప్రతి మండలంలోనూ ఓ భూకుంభకోణం వెలుగు చూస్తోందని తెలిపారు. రికార్డులను కూడా తారుమారు చేశారని చంద్రబాబు ఆరోపించారు. రీసర్వే అస్తవ్యస్తంగా జరగడం వల్లే ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదని స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో రెవెన్యూ, సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రాధాన్యం ఇస్తాం. రెవెన్యూ శాఖను గత ప్రభుత్వంలో నిర్వీర్యం చేశారు. మదనపల్లె ఘటనే రెవెన్యూ శాఖ నిర్వీర్యానికి ఉదాహరణ. వ్యవస్థలను 100 రోజుల్లో గాడిన పెడతాం. రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేస్తాం. భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. సమస్యలను విభాగాల వారీగా విభజించి పరిష్కరిస్తాం. వినతులు ఇచ్చేందుకు అమరావతి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం. నియోజకవర్గాలు, జిల్లాల్లో ఫిర్యాదులు తీసుకునేలా ఏర్పాట్లు చేస్తాం. నా పర్యటనల వల్ల ఎవరూ ఇబ్బందిపడకుండా మార్పులు తెస్తాం. శాఖల వారీగా సమీక్షలు సత్ఫలితాలు ఇస్తున్నాయి" అని చంద్రబాబు తెలిపారు.

## మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తిచేయాలి



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో నాలుగేళ్లుగా పెండింగ్లో ఉన్న లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎస్ఆర్ఎస్) ప్రక్రియను 3 నెలల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. శనివారం భూపాలపల్లి పర్యటనలో ఉన్న మంత్రి శ్రీనివాస్ రెడ్డి అక్కడి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిబంధనలకు లోబడి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్రమబద్ధీకరించాలని సూచించిన మంత్రి.. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సి ఉందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు ఎస్ఆర్ఎస్ దరఖాస్తులను తీసుకుంది. అప్పట్లో 25.70లక్షలు రాగా అందులో హెచ్ఎండీఏ పరిధిలో 3.58లక్షలు, జీహెచ్ఎంసీ పరిధిలో 1.06 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో 13.69 లక్షలు, గ్రామ పంచాయతీల్లో 6లక్షలు, అర్బన్ డెవలప్మెంట్ అథారిటి పరిధిలో 1.35 లక్షలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దరఖాస్తుదారులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నారని, వీటి పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. నిబంధనలను దృష్టిలో ఉంచుకుని భూముల క్రమబద్ధీకరణలో అక్రమాలకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్న మంత్రి.. దళారుల ప్రమేయం లేకుండా సాధారణ ప్రజానీకానికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## మారుతి సేవలు ప్రశంసనీయం

- 50 ఏళ్లుగా వేలాది కార్యక్రమాల నిర్వహణ అనితర సాధ్యం
- మంథని మున్సిపల్ ఛైర్ పర్సన్ పెండ్రు రమాదేవి




**విశ్వంభర, మంథని:**

యాభై ఏళ్లుగా మంథని ప్రాంతంలో కొండేల మారుతి చేస్తున్న సామాజిక సేవలు ప్రశంసనీయమని మంథని మున్సిపల్ ఛైర్ పర్సన్ పెండ్రు రమాదేవి కొనియాడారు. కొండేల మారుతి సేవాకార్యక్రమాల స్వర్ణోత్సవం సందర్భంగా శనివారం ఆయనకు జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.మారుతి స్పృశించని రంగమే లేదని, ఇన్నేళ్ళుగా నిర్విరామంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అనితర సాధ్యమని కొనియాడారు. మంథని అభివృద్ధికి సహకరించాలని దేశ విదేశాల్లో ఉన్న మంథని వారిని ఆమె ఈ సందర్భంగా కోరారు. మారుతి యాభై ఏళ్లలో దాదాపు 2500 కార్యక్రమాలు నిర్వహించడం సామాన్యమైన విషయం కాదని, ఇది రికార్డులకు ఎక్కాల్సిన అంశమని సీనియర్ జర్నలిస్ట్ రావికంటి శ్రీనివాస్ అన్నారు. సామాజిక సేవా రంగంలో ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించాలని కేంద్రాన్ని కోరారు. మంథని చరిత్రలో మారుతికి ప్రత్యేక స్థానం ఉంటుందని ఆయన అన్నారు. మంథని మాజీ సర్పంచ్ మాదాడి ప్రభాకర్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్ మధుకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నె హరి బాబు, తెలంగాణ ఉద్యమకారిణి సువర్ణ సులోచన, విశ్రాంత జెన్ కో అధికారి కొండేల బలరాం, మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్ అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చంద్రుపట్ల సుధాకర్ రెడ్డి, రామడుగు మారుతి, బోగోజు శ్రీనివాస్, కె.సత్యనారాయణ, కొత్త శ్రీనివాస్, తాటి బుచ్చయ్య గౌడ్, సర్వ చిన్న బాపు, గోపాలకృష్ణ, సిరాజొద్దీన్ రాజమౌళి గౌడ్, పాత్రికేయుడు సమ్మయ్య తదితరులు మారుతితో తమ అనుబంధాన్ని, ఆయన చేసిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా పలు సంస్థల ప్రతినిధులు మారుతి దంపతులను ఘనంగా సత్కరించారు. తనకు ఆత్మీయ సత్కారం చేసిన అందరికీ మారుతి ధన్యవాదాలు తెలిపారు. మరింత స్ఫూర్తితో సమాజ సేవకు పునరంకితం అవుతానని పేర్కొన్నారు.

## అమెరికాకు సీఎం రేవంత్



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేటి నుంచి ఈనెల 13 వరకు అమెరికా, దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం చెబుతోంది. ఐటీ, హెల్త్ కేర్, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్, తదితర రంగాలకు సంబంధించి రూ. 16వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చే ఒప్పందాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## నన్ను కించపరచడం వల్లే సహనం కోల్పోయా

- బయటకు చెప్పలేని పదాలతో దూషించారు
- ఎవరికైనా బాధ కలిగిస్తే క్షమాపణ చెబుతున్నా
- అధికారం కోల్పోవడం వల్ల బీఆర్ఎస్ నేతలు ఆవేదనతో రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారు
- ఆదర్శ నగర్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన దానం నాగేందర్

**విశ్వంభర, హైదరాబాద్:** అసెంబ్లీలో తనను కావాలని భారాస ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ విమర్శించారు. హైదరాబాద్ ఆదర్శ నగర్ లోని ఎమ్మెల్యే క్వార్టర్స్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శాసనసభలో హైదరాబాద్ అభివృద్ధిపై తనకు మాట్లాడే అవకాశం వచ్చినప్పుడు... భారాస ఎమ్మెల్యేలు ఆటంకం కలిగించారన్నారు. బయటకు చెప్పలేని పదాలతో దూషించారని ఆరోపించారు. వారు మాట్లాడింది మైక్ లో రికార్డు కాలేదని పేర్కొన్నారు. సీఎంను. తనను కించపరిచే విధంగా మాట్లాడటం వల్లే సహనం కోల్పోయి ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు."నేను చేసిన వ్యాఖ్యలు హైదరాబాద్ వాడుక భాషలోవే... అవి ఎవరికైనా బాధ కలిగిస్తే క్షమాపణ చెబుతున్నా. అధికారం కోల్పోవడం వల్ల బీఆర్ఎస్ నేతలు ఆవేదనతో రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి వారు సభను సజావుగా జరగకుండా అడ్డంకులు సృష్టించారు. గత పదేళ్లుగా ఏనాడూ నా లాంటి వారికి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం రాలేదు. భారాస ఎమ్మెల్యేలు అభివృద్ధికి సహకరించి తమ పద్ధతిని మార్చుకోవాలి" దానం నాగేందర్ తెలిపారు.

## మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)
వాడకం పెరిగినప్పటికీ సమస్య లేకుండా ఇస్తున్నామన్నారు.కరెంటు వాడకం పెరిగినప్పటికీ కరెంటును తెప్పించి ప్రజలకు ఇస్తున్నాం.. రాబోయే 10 ఏళ్లకు కూడా అవసరమయ్యే కరెంటుని ఉత్పత్తి చేస్తున్నాం.. పొల్యూషన్ లేని విద్యుత్ ఉత్పాదనపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది.. రాష్ట్రంలో ఎప్పుడూ కరెంటు కోత ఉండదు అని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రూ.20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నట్లు ఉపముఖ్యమంత్రి వెల్లడించారు. మధిర నియోజకవర్గంలో కొద్ది రోజుల్లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అంగన్వాడీలో 3వ తరగతి వరకు ఏర్పాటు చేసి, నాలుగో తరగతికి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలుకు పంపించే ఏర్పాటుకు నాంది పలికామన్నారు.మధిర నియోజకవర్గంలోని మహిళలను పాడి పరిశ్రమలో వాటాదారులుగా చేసి వారిని పారిశ్రామికవేత్తలుగా చేయడానికి 2014కు ముందే ఇందిరమ్మ డెయిరీని ప్రవేశపెట్టామని తెలిపారు. నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు గేదెలు ఇచ్చి వారిని పరిశ్రమలో వాటాదారులుగా చేస్తామన్నారు. ఆర్థికమంత్రిగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా బడ్జెట్ను ప్రవేశపెట్టానని తెలిపారు.

### దేశంలో 8 కొత్త జాతీయ రహదారులు..

**విశ్వంభర, ఢిల్లీ:** భారతదేశంలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ట్రాఫిక్ను క్రమబద్ధీకరించే లక్ష్యంతో 8 కొత్త జాతీయ రహదారులను నిర్మించే ప్రణాళిక కేంద్రం ఆమోదించింది . ఈ ముఖ్యమైన ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ ప్రాజెక్ట్ 936 కి.మీ పొడవుతో 8 హై-స్పీడ్ రోడ్ కారిడార్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని అంచనా వ్యయం రూ.50,655 కోట్లు.దేశవ్యాప్తంగా మెరుగైన కనెక్టివిటీని నిర్ధారించడం, లాజిస్టిక్‌లను మరింత ప్రభావవంతంగా చేయడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యమని కేంద్ర సమాచార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ విలేకరుల సమావేశంలో చెప్పారు. అదే సమయంలో ఈ ప్రాజెక్టులను బ్రౌన్‌ఫీల్డ్ సైట్‌లకు అనుసంధానం చేయడానికి కృషి చేస్తామని, తద్వారా భూ సేకరణను తగ్గించవచ్చు. అలాగే నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయవచ్చని ఆయన చెప్పారు.


### 8 మంది ఐఏఎస్ అధికారుల బదిలీ



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో 8 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టి.కె. శ్రీదేవిని ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ బదిలీ చేశారు. వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ గా రిజ్వీకి అదనపు బాధ్యతలు అప్పగించారు.విపత్తుల నిర్వహణ విభాగం సంయుక్త కార్యదర్శి ఎస్.హరీశ్కు రవాణా, ఆర్అండ్‌బ్ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.మార్కెటింగ్ శాఖ డైరెక్టర్గా ఉదయ్కుమార్కు అదనపు బాధ్యతలు కేటాయించారు. పురపాలక శాఖ ఉపకార్యదర్శిగా ప్రియాంక, హాకా ఎండీగా చంద్రశేఖర్ రెడ్డి, మార్క్ ఫెడ్ ఎండీగా శ్రీనివాస్ రెడ్డి, రవాణా, ఆర్అండ్ బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్రాజ్ బదిలీ అయ్యారు.

## నాగార్జున సాగర్ 4.94లక్షల క్యూసెక్కుల భారీ వరద

**విశ్వంభర, నాగార్జునసాగర్:** నాగార్జున సాగర్ జలాశయానికి భారీగా వరద కొనసాగుతున్నది. ప్రస్తుతం డ్యామ్‌కు ఇన్‌ఫ్లో 4.94 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. ప్రస్తుతం అవుట్ ఫ్లో 27,238 క్యూసెక్కులుగా ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుతం 563.60 అడుగులు ఉన్నది. డ్యామ్ నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం నీటి నిల్వ 240.83 టీఎంసీలుగా ఉన్నది. సాగర్ కుడి కాలువకు 6,324 క్యూసెక్కులు.. ఎడమ కాలువకు 1418, ఎల్ఎల్‌బీసీ (ఏఆర్ఎంపీ)కి మరో 1800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరో వైపు జూరాల ప్రియదర్శిని డ్యామ్‌కు సైతం వరద ప్రవాహం కొనసాగుతున్నది. జలాశయానికి 2.90లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది. ప్రస్తుతం జలాశయం నుంచి 2,66,192 వరదను దిగువకు వదులుతున్నారు. స్పిల్‌వే నుంచి 2,45,750 క్యూసెక్కులు, పవర్‌హౌస్ నుంచి 17,782 క్యూసెక్కులు విడుదలవుతున్నది. జలాశయం నీటిమట్టం 7.991 టీఎంసీలకు గాను ప్రస్తుతం 4.284 టీఎంసీల నిల్వ ఉన్నది.



# పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణను వెంటనే నిలిపివేయాలి

## ప్రపంచ శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి తక్షణ చర్యలు చేపట్టాలి

**విశ్వంభర, మేడ్చల్:** ప్రపంచవ్యాప్తంగా పాలస్తీనా సంఘీభావ ఉద్యమం బలపడటానికి ప్రపంచ ప్రజలంతా ముఖ్యంగా విద్యార్థులు, బలోపేతమైన ఉద్యమాల ద్వారా పాలసీన దేశం ఏర్పాటుకు , ప్రపంచంలో శాంతిని పరిరక్షించడానికి, ప్రజలంతా ఐక్యంగా పోరాటాల్లో ముందుండాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే.వీ.ఎల్. గారు పిలుపునివ్వడం జరిగింది. మేడ్చల్ లో ఎన్. ఎస్.ఆర్ జూనియర్ కళాశాల లో కళాశాల కరస్పాండెంట్ ఎన్. శశిధర్ రెడ్డి అధ్యక్షతన ప్రపంచశాంతి పై విద్యార్థుల పాత్ర అనే అంశంపై సెమినార్ జరిగింది. ఈ సెమినార్కు ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి. ఎల్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదం యుద్ధ, ఉన్మాదం రెండు ప్రపంచానికి ప్రమాదమేనని అన్నారు . వీటి, ఫలితంగా అభివృద్ధి చెందుతున్న దేశాల వ్యూహంలో చిక్కి, యుద్ధ వాతావరణంలో సర్వాన్ని దేశ సంపదను, సహజ వనరులను, అభివృద్ధి నష్టపోతున్నాయి అని , అంతేకాదు పాలస్తీనాలో ఇప్పుడు చాలా ప్రమాదకరమైన పరిస్థితి నెలకొన్నది అని తెలియజేసారు . ఇప్పటికే గాజాలో నీళ్లు, ఆహారం, నివాసవసతులు లేక ప్రజలందరూ కూడా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఆహారం అందకుండా పోవడం వలన, ఆకలి చావులు పెరిగిపోతున్నాయి. ఐక్యరాజ్యసమితి సూచనలు బేఖాతరు చేస్తుందన్నారు మానవ జీవితం దయనీయమైన పరిస్థితుల్లో కి నెట్టి వేయబడ్డదని




అన్నారు. యుద్ధం వల్ల ప్రతి ఒక్కరు చావుకు దగ్గరవుతున్నారని దీనికి కారణమైన ఇజ్రాయిల్ పట్ల ఐక్యరాజ్యసమితి ఆంక్షలు విధించాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి డీజీ నరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలో జరుగుతున్నటువంటి యుద్ధాలు ఆగకపోతే భూగోళం మీద శాంతి ఉండదని శాంతి లేకపోతే ప్రజల బ్రతుకులు ఆగమైపోతాయని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఉక్రేన్ రష్యా యుద్ధం సిరియా తదితర దేశాల మీద సామ్రాజ్యవాదులు చేస్తున్న యుద్ధాలు మనకు చేదు అనుభవాలను కలగజేస్తున్నాయన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఎన్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ యుద్ధాలకు వ్యతిరేకంగా విద్యార్థులు విద్యకు




సంబంధించిన సమస్యలు సామాజిక సమస్యలతో పాటు ప్రపంచంలో జరుగుతున్నయుద్ధాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటాల మీద కూడా దృష్టి పెట్టాలని వీటికి వ్యతిరేకంగా శాంతి సాధన కొరకు కృషి చేయాలని అన్నారు. రంగారెడ్డి జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి కార్యదర్శి పోలగాని రవి కిషోర్ మాట్లాడుతూ సోవియట్ రష్యా యుద్ధాలు యుద్ధాలకు వ్యతిరేకంగా లెనిన్ నాయకత్వంలో శాంతిని తీసుకొచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ రెడ్డి హెచ్ ఓ డి రమేష్, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంని కలిసిన బీసీ కమిషన్ చైర్మన్

**విశ్వంభర, హైద్రాబాద్ :** తెలంగాణ బీసీ కమిషన్ వివిధ అధ్యయనాలలో భాగంగా కోరే సమాచారాన్ని, వివరాలను వెంటనే అందించి, సహకరించేలా ఆయా ప్రభుత్వ విభాగాలకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.శుక్రవారం నాడు రాత్రి అసెంబ్లీ లో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు, పలు పత్రాలు అందజేసినట్లు డాక్టర్ వకుళాభరణం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ల ను నిర్ణయించడానికి గాను ,అలాగే ప్రభుత్వం ఇచ్చిన టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ మేరకు ఆయా ప్రభుత్వ విభాగాలను సమాచారం ఇవ్వాలని బీసీ కమిషన్ ఎప్పటికప్పుడు లేఖలను



రాయడం జరుగుతుంది. త్వరగా కమిషన్ కు వివరాలు అందినట్లైతే నివేదికలను సకాలంలో అందజేయడానికి వీలుంటుందని వకుళాభరణం తెలియజేసారు.

# జనగామలో గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం

**తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చకూడదని జనగామ జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘాలు నిరసన**

**విశ్వంభర, జనగామ:** తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చడం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ప్రతిపాదించడం సరైన విధానం కాదని జనగామ జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘాలు నిరసన వ్యక్తం చేసాయి. అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేసినందుకు నిరసన తెలియజేస్తూ గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ



ప్రతిపాదనను ఏ పార్టీలు కూడా అంగీకరించిన వారిపై శాంతియుతంగా ఉద్యమం చేస్తామని పొట్టి శ్రీరాములు పేరు మార్పు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని ఆర్య వైశ్యులంతా ఒకతాటిపై వచ్చి సంఘటితంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# రైతులకు రైతుబంధు లేదు కానీ? కొడంగల్ కి రూ.4,370 కోట్లు



**విశ్వంభర, కొల్లాపూర్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని లక్షల మందికి రుణమాఫీ చేసి రైతుబంధు నిధులు పక్క-దోవ పట్టిస్తూ ఆ ఊసే ఎత్తకుండా తన సొంత నియోజకవర్గమైన కొడంగల్ కు 4,370 కోట్లు మంజూరు చేసిన ముఖ్య-మంత్రి రేవంత్ రెడ్డిని, భారత రాష్ట్ర సమితి నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు డీకే మాదిగ మండి పడ్డారు. రైతు భరోసా కింద రైతులకు 15000 రూపాయలు వేస్తానని, కౌలు రైతులకు 15000 రూపాయలు , వలస కూలీలకు 12,000 రూపాయలు, ఈ రైతులకు ఇచ్చే నిధులు ఇవ్వకుండా ఏమార్చి రుణమాఫీ పేరుతో ప్రజలను ఆకర్షించడానికి మభ్యపెడుతు-న్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు భరోసా కింద ఇచ్చే రైతుబంధు డబ్బులు ఏక్కడికి పోయాయో ? శ్వేత పత్రం విడుదల చేయాలని డీకే మాదిగ ముఖ్యమంత్రి ని డిమాండ్ చే-శారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కలర్ మహేష్, వినయ్, రాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# మృతి చెందిన కార్యకర్తలకు ఎమ్మెల్యే నివాళులు

**విశ్వంభర, సూర్యాపేట :** సూర్యాపేట నియోజకవర్గం ఆత్మకూరు(ఎస్) మండలంలో ఇటీవల బిఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు మరణించడంతో మాజీ మంత్రి ,ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి వారి కుటుంబాలను కలిసి సానుభూతి తెలియజేస్తూ మరణించిన వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మరణించిన వారిలో కోటి నాయక్ తండ లో ధరావత్ నాగు, పాతర్ల పహాడ్ గ్రామంలో జటంగి వెంకటయ్య, బండ్లపల్లి భద్రయ్య , తుమ్మల పెన్పహాడ్ గ్రామం లో పిడమర్తి వీరయ్యల కుటుంబాలకు అండగా ఉంటానని భరోసా కల్పిస్తూ పరామర్శించడం జరిగింది. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతిఒక్కరిని బిఆర్ఎస్ పార్టీ చేరదీస్తుందని అధైర్యపడవద్దని ధైర్యం చెప్పడం జరిగింది.

## ఘనంగా అష్టలక్ష్మీ దేవాలయం అధ్యక్షుని జన్మదిన వేడుకలు


**విశ్వంభర, ఎల్బీ నగర్ :** ప్రముఖ వాసవి హాస్పిటల్ ఛైర్మెన్, వాసవి కాలనీ సంక్షేమ సంఘం, అష్టలక్ష్మీ దేవాలయం అధ్యక్షులు గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్త జన్మదినం సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో



శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరిశెట్టి అరుణ్ కుమార్, రామకృష్ణ , వంగాల శ్రీకాంత్ రెడ్డి, వరుణ్ నంద్యాల విప్లవ్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా మోర్చా కార్యదర్శిగా

# రాపోలు గాయత్రి



**విశ్వంభర, నల్గొండ :** రాష్ట్ర మహిళమోర్చా ఉపాధ్యక్షురాలు కొండేటి సరిత ఆధ్వర్యంలో బీజేపీ నల్గొండ అధ్యక్షులు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి చేతుల మీదుగా జిల్లా మహిళ మోర్చా కార్యదర్శి గా రాపోలు గాయత్రికి నియామక పత్రాన్ని అందించారు. పార్టీకి , మహిళలకు సేవలు అందించాలని ఆశిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు. రాపోలు గాయత్రీ మాట్లాడుతూ నా ఈ నియామకానికి సహకరించిన జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కాశక్క,రాష్ట నాయకులు కొండేటి సరిత తదితర మహిళా నాయకులుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు

# పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం

**పేరు మార్పు విరమించుకోవాలి**

**అవోపా రాష్ట్ర అధ్యక్షుడు మలిపెది శంకర్**



**విశ్వంభర, షాద్‌నగర్:** శుక్రవారం అసెంబ్లీ స మా వే శం లో చర్చలో భాగంగా పొట్టి శ్రీరాములు విశ్వా విద్యాలయం పేరు మార్పు పై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర అవోపా అధ్యక్షుడు మలిపెది శంకర్ కోరారు. పేరు మార్పు నిర్ణయాన్ని విరమించుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా కలసి కోరుతామని అయన తెలిపారు. భాషాప్రముక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం ముఖ్యంగా తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేసి ఆత్మ బలిదానం గావించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించి తెలుగు వారి ఆత్మగౌరవాన్ని కాపాడిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని తెలిపారు.



# ఎస్సీ వర్గీకరణ గొప్ప విజయం

**మంత్రి ఉత్తమ్ పై సైదిరెడ్డి ఆగ్రహం**

**విశ్వంభర, సూర్యాపేట:** ఎస్సి వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ పోరాటం, ప్రధాని మోడీ సహకారంతో నేడు వర్గీకరణ విజయం సాధించిందని మాజీ ఎమ్మెల్యే బీజేపీ పార్టీ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జీ శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణకై అలుపెరగని పోరాటం చేసినందుకు విజయాన్ని ముద్దాడినందుకు, మందకృష్ణ మాదిగకి, ఎస్సీ సామాజిక వర్గం మిత్రులందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని, మొదలు రేషన్ కార్డు ఆధారితం కాదని ఇప్పుడు రేషన్ కార్డు ను ఆధారంగా చేసుకొని ర్యాతులను మోసం చేస్తూ , నష్టపరిచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పై దుయ్యబట్టారు. రైతు రుణమాఫీపై బిజెపి పార్టీ పోరాటం చేస్తోందని తెలుపుతూ ఎవరికైతే రైతు రుణమాఫీ కాలేదో వారికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా ఒక టోల్ ఫ్రీ 8886100097 నెంబర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని రుణమాఫీ రాకుండా ఉన్నటువంటి నిజమైన రైతులకి బిజెపి పార్టీ అండగా నిలుస్తుంది అని సైదిరెడ్డి పేర్కొన్నారు. హుజూర్నగర్ లో స్టాండు, ల్యాండు, రాజన్న అక్రమ రేషన్, యదేచ్ఛగా నడుస్తోందని, అక్రమంగా చెరువులో మట్టి తవ్వుతూ మత్స్యకారులకు ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారు.సివిల్ సప్లైలో కోట్ల కొద్ది అవినీతి జరిగిందని గతంలో సీజ్ చేసిన ధాన్యాన్ని తరలించడం జరిగిందని ఎటువంటి విచారణ కూడా లేకుండా చేస్తున్నారని, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేరును వాడుతూ యదేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు.. దీనిపై వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించాలని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో మండల, పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి, రవి బీజేపీ నాయకులు సోమిరెడ్డి, జనిగల శ్రీనివాస్, బెల్లంకొండ నాగరాజు, వెంకట శివ, హిందూజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మోఢీ, మందకృష్ణలకు పాలాభిషేకం

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సందర్భంగా ఎల్బీనగర్, హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ ప్రాంతాలలో అంబేద్కర్ విగ్రహాల వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మందకృష్ణ మాదిగలకి పాలాభిషేకం చేసారు. SC మోర్చా అధ్యక్షులు పారంద సాయి నేతృత్వంలో జరిగిన పాలభిషేకం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డితో కలిసి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ 30 ఏండ్లు,3 దశాబ్దాలు అలుపెరగని పోరాటం, ఎన్నో అవమానాలను తట్టుకొని జాతి భవిష్యత్తుకై పోరాడుతూ ఎస్సీ ఎబిసిడి వర్గీకరణను ఆమోదం తెలపాలని




ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ , ఎమ్మార్పీఎస్ నాయకులు తో కలసి న్యాయ పోరాట పటిమతో సాధించాలని గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మద్దతు తెలిపాలని కోరిన నిమ్మకు నీరెత్తినట్లు కాంగ్రెస్,తెరాస ప్రభుత్వాలు వ్యవహరించిన, తన దృఢ సంకల్పంతో పోరాడి వర్గీకరణను అంతిమ విజయం సాధించారని అన్నారు. అదేవిధంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర కేంద్ర మంత్రులు, జాతీయ మంత్రులు , బిజెపి కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈరోజు వర్గీకరణ అమలు కావడం ఆనందం వ్యక్తం చేస్తూ బాణాసంచాలు కాల్చి, స్వీట్లు తినిపించుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, జగన్, శ్రీను, చిరు,యాదయ్య, రామేశ్వర, హరీష్ రెడ్డి, ముత్యం రెడ్డి, కవిత రెడ్డి, శ్రీధర్ గౌడ్, సాయి రామ్ గౌడ్, రాజేష్ గౌడ్, జయతేజ, రోహిత్ రెడ్డి, నర్సిముడు, శ్యామ్ సుందర్ రెడ్డి, ఎల్లా రెడ్డి, రవితేజ, దశరథ్, గోవింద్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, భారత్, సిద్ధార్థ్, సంతోష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల కోసం, ప్రజలవెంట నడిచిన గద్దర్

ప్రజల కోసమే జీవించి, ప్రజల కోసమే తపించి, ప్రజలకే అంకితమై ప్రజలవెంట ప్రయాణించిన గద్దర్ అమరుడై యాడాదవుతోంది. చావు నీది పుట్టుక నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటకు నిలువెత్తు నిదర్శనం గద్దర్ జీవితం.గద్దర్ ప్రయాణం విస్తారమైనది. గద్దర్ జీవిత ప్రయాణం ప్రజల కనుకూలంగా ప్రజలను అంటిపెట్టుకొని సాగుతూ వచ్చింది. తన అవగాహన ఎదిగే క్రమంలో ప్రజల ఆశల వెంట, వారి ఉద్యమాల వెంట నడవడం కోసమే.




**ఆర్ట్ లవర్స్ తో మొదలై విశ్వం దాకా...**
1970 నుండి అయిదున్నర దశాబ్దాలుగా గద్దర్ చేసిన ప్రయాణం విశ్వం దాకా విస్తరించిన రంగాలు అనేకం. కుటుంబ సంక్షేమం పాటలనుండి విప్లవపాటల వైపు మలుపు తిరగడంలో ఎదగడంలో బి. నర్సింగరావు, పాత్ర తండ్రి నిర్వహించిన పాత్ర వంటిది. ఆర్ట్ లవర్స్ నుండి జన నాట్యమండలిగా సాంస్కృతిక ఉద్యమం సమాజంలో మహోన్నత పాత్ర నిర్వహించింది.

**గద్దర్ టచ్ చేయని రంగం లేదు..**
సంఘ సంస్కరణ, మూఢ విశ్వాసాల నిర్మూలన, కులాంతర మతాంతర వివాహాలను ప్రోత్సహించడం, ప్రజలను నిరాశా నిస్పృహలనుండి మేల్కొలిపి తమ సమస్యలపై ఉద్యమాల బాట పట్టించడం, విద్యార్థులు, యువకులు, రైతుకూలీలు, విద్యావంతులు మేధావులు, ఉద్యోగులు కార్మికులు, ఉపాధ్యాయులు, దళిత మహాసభ, తెలంగాణ ఉద్యమం,, బీసీలు, ఎస్సీలు ఆదివాసులు, మైనారిటీలు గ్రామీణులు, నగర వాసులు ఇలా ఒకటి కాదు రెండు కాదు. సమస్త రంగాల ప్రజలను ముందుకు నడిపి ఉద్యమాల బాట పట్టించినవాడు గద్దర్. గద్దర్ ప్రయాణం ఒక వ్యాసంలోనో ఒక పుస్తకంలోనో, ఒక పార్టీ చరిత్రలోనో, ఏదో ఒక ఉద్యమ చరిత్ర లోనో ఇమిడేది కాదు. ఏ పాత్రతో కొలిచినా గద్దర్ ముందు ఆ పాత్ర చిన్నదైపోతుంది. గద్దరన్ను కొలవడానికి కొలతలు లేవు. గద్దర్ ఒక మాస్ లీడర్. ప్రజా కళాకారుడు. గద్దర్ వస్తున్నాడంటే ఆయన పాట మాట వినడానికి లక్షలాది ప్రజలు స్వయంగా ఉత్తేజంతో వచ్చేవారు. గద్దర్ ఆకర్షణ శక్తి అలాంటిది. అందుకే ఎన్నో ఉద్యమాలు, ఎన్నో రంగాల వారు తమ మీటింగులకు గద్దర్ రావాలని కావాలని పిలుచుకునేవారు.


**గద్దర్ ఏ పాట రాసినా...**
గద్దర్ ఏ పాట రాసినా ఆ సబ్జెక్టును అనేక కోణాల్లో అధ్యయనం చేస్తారు. రాసినాక ప్రజల భాషకనువులుగా మార్పులు చేస్తారు. ఆ మార్పులు ఎలా జరిగేవో తరగని గని ఒక పుస్తకమే రాసారు. తన భావాలు సందర్భాల గురించి పాటకు జీవకణం పుస్తకం రాసారు. ఈ రెండు పుస్తకాలను గద్దర్ మేనల్లుడు సత్యం సంకలించి ప్రచురించాడు. గద్దర్ పాటలు అనేక సంకలనాల్లో చేరి లక్షల కాపీలు అమ్ముడయ్యాయి.

**గద్దర్ అందరికి కావాలి..**
గద్దర్ ను బోనాల పండుగలకు రమ్మంటారు. జాతరలకు రమ్మంటారు. ఎక్కడికి వెళ్లినా వారిని ఉత్తేజ పరిచి తనవైపుకు మలిచి సామాజిక చైతన్యం నింపేవారు. ఇన్ని అవకాశాలు ఎవరికి రావు. ఆయన మాట పాటే ఆయనకీ అవకాశాలు తెచ్చి పెట్టాయి. చివరకు పోలీసు అధికారులు కూడా గద్దర్ అభిమానులే. దేశవ్యాప్త పర్యటనలతో ప్రదర్శనలతో గద్దర్ను మించినవారు లేరని దేశమంతా ఒప్పేసుకుంది. దేశం ఎల్లలు దాటి ప్రపంచమే గద్దర్ను ప్రపంచ మహా కళారుడు, మహాకవి అని ఒప్పేసుకుంది.

**గద్దర్ అవును, సరే అనివుంటే...**
గద్దర్ వద్దనుకున్నాడుగానీ ఆయన సరేనంటే కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు, పద్మశ్రీ పద్మభూషన్లు, నోబుల్ బహుమతులు, గవర్నర్, ఉప రాష్ట్రపతి వంటి పదవులు వెతుక్కుంటూ వచ్చి గద్దర్ ఒడిలో వాలేవి. గద్దర్ ప్రభావితం చేయని రంగం లేదు. పరిశుభ్రత సీజనల్ రోగాలు, జాగ్రత్తలగురించి కూడా ఎన్నో పాటలు రాసి పాడాడు.

**గద్దర్ లేకుంటే...**
గద్దర్ గురించి ఇపుడు నేను కొత్తగా చెప్పేదేమిటి? గద్దర్ లేకుండా విప్లవ ఉ ద్యమాల కేడర్ లేదు. ఉద్యమాల విస్తృతి లేదు. ఉద్యమాలకు గద్దర్ నిట్టాడై నిలిచాడు. తన అభిప్రాయాలు మారినా ఉద్యమాలు దెబ్బదినకూడదని నిరంతరం మద్దతు ఇస్తూనే వచ్చాడు గద్దర్. గద్దర్ గనక ఎన్టీఆర్ లా తిరిగి వుంటే తానే ముఖ్యమంత్రి అయ్యేవాడు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముఖ్యమంత్రి అయ్యేవాడు. గద్దర్ ను రాష్ట్రపతిగా చూడాలనుకున్నారు కొందరు. గద్దర్కు అవంటే ఆసక్తి లేదు కళాకారుడిగానే వుండి పోవాలనుకున్నాడు.

**గద్దర్ ప్రజలను ప్రేమించాడు..**
గద్దర్ ప్రజలను ప్రేమించాడు. ప్రజా ఉద్యమాలను ప్రేమించాడు. సమ సమాజ నిర్మాణంకోసం తపించాడు. ఉద్యమించాడు. అంటరానితనం, కుల వివక్ష, అసమానతలు లేని మనిషిని మనిషిగా చూసే వ్యవస్థకోసం జీవితాన్ని అంకితం చేశాడు. గద్దర్ ప్రపంచ ప్రసిద్ధ కళారుడు, మహాకవి, వాగ్గేయకారుడు. గద్దర్తో పోల్చదగినవారు ప్రపంచంలో అరుదు. గద్దర్ అమెరికా నల్లజాతి వీరుడు మార్టిన్ లూథర్కింగ్ జూనియర్ తో పోల్చుదామా! ఆయన గొప్ప ఉపన్యాసకుడు తప్ప




కళాకారుడు కాదు. గద్దర్ మనకాలపు యుగకర్త. తన సాహిత్యం, గానం, అభినయ సమన్వయంతో భావాలతో కోట్లాది ప్రజలను ప్రభావితం చేసినవాడు గద్దర్. లక్షలాది కళాకారులకు ఒక ఆదర్శ నమూనా నిలిచినవాడు గద్దర్.

**గద్దర్ ఒక ట్రెండ్, గద్దర్ ఒక లెజెండ్**
గద్దర్ ఒక ట్రెండ్. గద్దర్ ఒక లెజెండ్. గద్దర్ ఆయా పార్టీలకు ఉద్యమాలకుకోట్లాది అభిమానులను సంపాదించి పెట్టిన గద్దర్, ఎన్నో శిఖరాలను అధిరోహించాడు. కోట్లాది ప్రజల్ల గుండెల్లోకి విస్తరించిన వాడు గద్దర్. ప్రజల జీవితాల బాగు కోరినవాడు గద్దర్. నిరంతరం ప్రజ ల గురించి తపించినవాడు గద్దర్.

**గద్దర్ ప్రజల మనిషి..**
గద్దర్ ప్రజల మనిషి, సాయుధ పోరాటం గురించి దశాబ్దాలుగా ప్రచారం చేసిన గద్దర్ కాలానుగుణంగా పరిణతి చెందారు. నూతన ఆలోచనలను విత్తనాల్లా వెదజల్లాడు. ఎన్నికల్లో పాల్గొనడం పై నక్సలైట్లు సానుకూలంగా పునరాలోచించాలని భావించాడు. సమ్రాట్ అశోకుడు భారతదేశాన్ని జయించే క్రమంలో కళింగ యుద్ధం చేసి బాధపడి బౌద్ధంతో శాంతి కాముకుడయ్యాడు. అలా విప్లవ పార్టీలు కూడా యుద్ధ భీభత్సాలు చూసి శాంతి వైపు మారాలని ప్రజలు అనుకున్నారు.. గద్దర్ కూడ అనుకున్నాడు. తన ఆటపాట మాటలతో కోట్లాది మందిని కదిలించిన గద్దర్ వేలాది మంది ప్రాణాలు కోల్పోయి అమరులయ్యాక పునరాలోచనలో పడ్డాడు.

**గద్దర్ పట్టించుకున్న కుల సమస్య మత సమస్య..**
భారత దేశంలో కుల సమస్య, మత సమస్య, కారంచేడు, చుండూరు, సంఘటనలు, సత్యమూర్తి చర్చలు, సత్యమూర్తి పై వేటు, బహుజన సమాజ్ పార్టీ ప్రచారం క్రమంలో గద్దర్, అంబేద్కర్ను బౌద్ధంను పునరధ్యయనం చేస్తూ పరివర్తన చెందాడు. గమనించారో లేదో గాని గద్దర్ సైద్ధాంతికంగా తనదైన అనుభవాల కోణంలో ప్రత్యేకంగా ఆలోచించాడు. 1994 నుండి తన శాంతి కాముకతను వినిపించడం ప్రారంభించాడు. గద్దర్ నాలుగు దశాబ్దాల పాటు మేం కలిసి నడవడం చరిత్ర సృష్టించడమా అవకాశం. తెలంగా సాంస్కృతిక సమాఖ్య దాకా పెనవేసుకున్న బంధం.

**పీపుల్స్ వార్ పార్టీ ఎన్నికలలో నిలబడి ఉంటే...**
పీపుల్స్ వార్ పార్టీ ఎన్నికల్లో నిలబడి ఉంటే బిజెపికి అధికారం ఎక్కడిది? జనతా పార్టీ, జనతాదళ్ గ్రూపులతో ఒకవైపు, కాంగ్రెస్ యుపిఐ గ్రూపులతో ఒకవైపు కలిసి ముందుకు సాగే క్రమంలో పీపుల్స్ వార్ నిర్ణాయక పాత్ర నిర్వహించి ఉండేది. నేపాల్లో ప్రచండ అధికారంలోకి వచ్చినట్లుగా కీలకపాత్ర నిర్వహించిఉండేది. కాన్షీరామ్ వంటి నూతన శక్తుల బలం ఎన్నో రెట్లు పెరిగి దేశమే ఒక గొప్ప ప్రజాస్వామిక స్వామ్యవాద ప్రధాన భూమికగా మలుపు తిరిగి ఉండేది. కానీ అది జరగలేదు.
పీపుల్స్ వార్ పార్టీ ఎన్నికల్లో నిలబడాలి అని నిర్ణయం తీసుకొని వుంటే దేశ చరిత్ర రాష్ట్ర చరిత్ర వేరుగా వుండేది. గద్దర్ ప్రభావం మరింత ఉత్తేజ పూరితంగా సాగి వుండేది. ప్రజలు అధికారంలో భాగస్వామ్యం పొంది వుండేవారు. అలాంటి నిర్ణయం తీసుకోక పోవడం వల్ల లక్షలాది ప్రజలు చాలా నష్ట పోయారు. చాలా కష్టాల పాలయ్యారు. భరించలేని నిర్బంధాలతో బొంబాయి గల్ఫ్ దేశాల బాట పట్టారు. కొన్ని పార్టీలు ఎన్నికల బహిష్కరణ ద్వారా పాలక వర్గాలకు పోటీ లేకుండా పువ్వుల్లో పెట్టి అధికారం అందించారు. వారు అధికారంలోకి వచ్చి అధికారికంగా దౌర్జన్యం, నిర్బంధం అణిచి వేత కొనసాగించారు. ప్రజలు ఏ చిన్న అధికారం లోనైనా రావడం ప్రజల పేరు పెట్టుకొని రాజకీయాలు చేసిన పార్టీ సహించ లేక పోయింది. దేశ చరిత్రలో ఇది ఒక దుష్ట సంప్రదాయం.

**ప్రజలు రాజకీయాల్లో తమ ప్రాధాన్యతను కోరుకున్నారు..**
ప్రజలు తమ సామాజిక వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం వుండాలని, కులాల వారీగా కోరుతూ వస్తున్నారు. రాజ్యాధికారంలో ప్రాతినిధ్యం యొక్క ప్రాధాన్యత రోజు రోజుకు పెరుగుతున్నది. అన్ని రంగాలకు విస్తరిస్తున్నది. ప్రజల కోరిక మేరకు. ఎన్నికలలో పాల్గొని వుంటే గద్దర్ తన ప్రచారంతో వేలాది మందిని గెలిపించి వుండే వాడు. నిర్బంధం ఇలా వుండేది కాదు. ఉద్యోగాలు చేస్తూ విప్లవ రాజకీయాలు చెప్పేవారికి ఎన్నికలలో పాల్గొనే పార్టీకి ప్రచారం చేయడం కుదరదు. అలాంటి మధ్యతరగతి మేధావులు ఉద్యోగులు ఉపాధ్యాయుల పరిమితి ప్రయోజనాలకు ఉద్యమం రాజకీయ ప్రాతినిధ్యం కోరిక బలి అయిపోయింది. లేదా పార్టీకి ప్రజలు అధికారంలో భాగస్వామ్యం పొందడం ఇష్టం లేదనుకోవాలి. ఏమైతేనేం చేతికి అంది వచ్చే అధికారాన్ని దూరం చేసారు.

**పార్టీ ఊం అంటే...**
పార్టీ ఊం అంటే ఎన్టీఆర్ ప్రభంజనం వలె 1983 లో వీరి ప్రభంజనం సాగి రాజకీయాలు మలుపు తిరిగేవి. 1983 లో మేనెలలో కరీంనగర్లో జరిగినరైతుకూలీ సంఘం మహాసభలతో ప్రజలు ఇలాగే భావించారు. విప్లవ పార్టీ చేసిన పొరపాటుకు ఎన్నికలలో పాల్గొనాలన్నవారు బలయ్యారు. పార్టీని నమ్మిన బహుజనులు చాలా నష్టపోయారు. గద్దర్ గొప్ప కళాకారుడు. వాగ్గేయ కారుడు. ఒక ప్రవక్తలా ప్రజలు గౌరవించారు. గద్దరన్ను ఎందుకు. యుద్ధ నౌక అని కుదించి పిలవడం? ఆయన ప్రభావం పడని రంగం లేదు. ఆయన స్ఫూర్తి దేశమంతటా విస్తరించింది.

**గద్దర్ మారాడు..**
కొన్ని దశాబ్దాల కాలం సాయుధ పోరాటాన్ని ప్రచారం చేసిన కళాకారుడు గద్దర్. ఆ తరువాత మనసు మార్చుకున్నాడు. మరో మార్గం వుందని గమనించాడు. అలా మలుపు తిరగడానికి ఎన్ని కారణాలైనా చెప్పవచ్చు. దరకమే ఐక్య వేదిక అధ్యక్షుడిగా నేను, నాతో పాటు పాల్గొన్న బుద్దిస్టు కె ఎన్ రామదాస్ వెంకటా పురంలోని గద్దర్ ఇంటిలో 1993 లో ఏక ధాటిగా 14 గంటలు చర్చలు జరిగాయి. మార్క్సిజం మీద, అంబేద్కర్, బౌద్ధం మీద, కార్మిక వర్గ నియంతృత్వం మీద, అదనపు విలువ, పరాయీకరణ మీద, చర్చలు జరిగాయి. ఒకే పార్టీ లో కలిసి పని చేసిన అనుభవాలు చర్చించుకున్నాం.

**యుద్ధానికి అంతులేదా...?**
మహా భారత యుద్ధం 20 రోజుల్లో ముగిసింది. ఇండో పాక్ యుద్ధం నెల రోజుల్లో ముగిసింది. ప్రపంచయుద్ధాలు కొన్ని సంవత్సరాల్లో ముగిసాయి. ఇదేమి యుద్ధం అంతు దరి లేకుండా దశాబ్దాలపాటు సాగడం? తమ జీవిత కాలంలో విప్లవ విజయం చూడలేం అని, రెండు ప్రపంచ యుద్ధాలతో ముడిపడి సాధ్యమైన రష్యా, చైనా విజయాల వంటి కాలం కాదని తేలి పోయింది. ఆ దేశాల్లో 35 ఏళ్లలో విప్లవాలు ముందుకు సాగి అధికారంలోకి వచ్చారు. మనదంతా పగటి కల, భ్రమల బతుకులు అని తేలి పోయింది. మేం ఉత్పత్తి సంబంధాలను, రక్త సంబంధాలను వర్గాలను సృష్టించే కులంను కులవ్యవస్థను, వదిలేసి చేసిన వర్గ వైరుధ్యాల విశ్లేషణలతోనే బొక్క బోర్లా పడ్డామని తేలి పోయింది. ఈ చర్చలను కాకినాడ నుండి వెలువడే గోదావరి కెరటాలు మాసపత్రికలో రికార్డు చేశారు. గద్దర్, నేను, కంచ ఐలయ్య, గద్దర్ కలిసి బౌద్ధ స్వీకార ప్రకటన చేయాలనుకున్నాము.
సరైనవారు ఆర్గనైజ్ చేసేవారు లేక లేక ఆదిలోనే అది కార్యరూపం దాల్చ లేదు.

**కాలంతోపాటు గద్దర్ పరిణామం చెందాడు. అయినా...**
కాలంతోపాటు గద్దర్ పరిణామం చెందాడు. తాను అనుకున్న పార్టీ మారడానికి సిద్ధంగా లేకపోయినా తాను ప్రజలవెంట, ప్రపంచ గమనం మారడానికి నిశ్చయించుకున్నాడు. అలా శాంతియుత పంథాలో వీలైన వారందరిని కలుపుకొని ముందుకు సాగారు. ఆరు తూటాలు తిని తిరిగి బతికారు. ఐనా తెలంగాణ ఉ ద్యమంలో గద్దర్ అనేక శాంతి యాత్రలు చేసారు. లక్షలాదిమందిని కదిలించారు. ప్రజల ఓటుతో ఎన్నికై ప్రజలనే అణిచివేసే పాలకుల దుర్మార్గాలను ఎప్పటికప్పుడు విమర్శించాడు. ఎన్నో కేసుల పాలయ్యారు గద్దర్ మాట పాట అవుతుంది. పాట నినాదం అవుతుంది. నినాదం సిద్ధాంతం అవుతుంది. కాన్షీరాం ఓట్లు మావి సీట్లు మీవా ? అని ప్రశించడంతో దేశం ఉలిక్కి పడింది. బుద్ధుడు, నాగార్జునుడు, భక్తి ఉద్యమాలు, కాన్సీరాంను, అంబేద్కర్ను మళ్ళీ మళ్ళీ అనేక కోణాల్లో అధ్యయనం చేశాడు గద్దర్.



- బి. ఎస్.రాములు
బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, తెలంగాణ
ఫోన్ : 8331966987

### భారత రాజ్యాంగం విశిష్టత గుర్తించిన గద్దర్..

గద్దర్ భారత రాజ్యాంగాన్ని పదే పదే గుర్తు చేసుకోవడానికి, కోట్ చేయడానికి బలమైన అనేక కారణాలున్నాయి. తమ సిద్ధాంతాలను ప్రచారం చేసినంతకాలం గద్దరు గౌరవించారు. కాని ప్రజలు గద్దర్ ను మలుపు తిరిగిన భావాలను కూడా గౌరవిస్తూ స్ఫూర్తి పొందారు. అభిమానించారు. గద్దర్ సృష్టించిన సాహిత్యం, ఇచ్చి కార్యక్రమాలు వందలాది క్యాసెట్లలో, పుస్తకాల్లో యూట్యూబ్లలో రికార్డయ్యాయి. బి. నర్సింగరావు వంటి పెద్దలు వాటిని భద్రపరిచారు. సత్యం పుస్తకాలు వేసారు. గద్దర్ రాసిన అనుభవాలు భావాలు ప్రజలకు అందాలి. అందుకు వాటిని అంశాలవారీగా పుస్తకాలుగా ప్రచురించాలి. గద్దర్ ఫౌండేషన్ భావితరాలకు అందించాలి. శాంతియుత పరివర్తన దిశగా భారత రాజ్యాంగ విశిష్టతను గుర్తించిన గద్దర్ను ఇంకా యుద్దానికి మద్దతుదారుగా చేసే ప్రచాన్ని నిలువరించాలి. శాంతి పథాన, బుద్ధుడి మార్గాన, రాజ్యాంగ విధానం ఎదగడం అవసరాన్ని గద్దర్ గుర్తించాడు. చరిత్ర రూపుదిద్దిన మహాకవి, కళాకారుడు, ప్రజలున్నంత కాలం, ప్రజల ఆశలు పోరాటాలు ఉన్నంతకాలం గద్దర్ను ప్రజలు గుర్తు చేసుకుంటూనే వుంటారు. ఆగస్టు 6 న జరుగనున్న గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా జోహార్లు.

# భరతనాట్యానికి వన్నె తెచ్చిన ప్రతిభాశాలి

**నాట్యరంగానికి పూర్తి జీవితం అంకితం..**

**భారతీయ నృత్య కళాకారణి యామినీ కృష్ణమూర్తి (స్మృతిలో)**

కూచిపూడి, భరతనాట్య నృత్య ప్రదర్శనలలో తనదైన ప్రత్యేకతతో, శైలితో, ఒరవడితో రాణించి భారతీయ నాట్యకళకు దేశ విదేశాలలో విశేషమైన ఖ్యాతిని సముపార్జించి పెట్టినయామినీ కృష్ణమూర్తి గారు, ఆంధ్రప్రదేశ్లోని చిత్తూరు జిల్లా, మదనపల్లిలో 1940వ సంవత్సరం డిసెంబరు 20న జన్మించారు. ఈమె తండ్రి కృష్ణమూర్తి సంస్కృత పండితుడు. తాత ఉర్దూ కవి. అటుపై వాళ్ల కుటుంబం తమిళనాడులోని చిదంబరంలో స్థిరపడింది. భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం సంపాదించిన యామిని 1957లో తొలి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అప్పటి నుంచి వేలాదిగా ప్రదర్శనలిచ్చి దేశ, విదేశాల్లో పేరు పొందారు.
ఈమె పూర్తి పేరు యామినీ పూర్ణతిలకం. తన తండ్రి ప్రోత్సాహంతో తన 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరత నాట్యము నేర్చుకోవడము ప్రారంభించారు. భరత నాట్యంలో ఈమె గురువులు కాంచీపురం ఎల్లప్ప పిళ్ళై, చొక్కలింగం పిళ్లై, బాలసరస్వతి, తంజావూర్ కిట్టప్ప, దండాయుధపాణి, మైలాపూర్ గౌరి అమ్మ మొదలైనవారు. వీరు వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ వంటి వారి వద్ద కూచిపూడి నేర్చారు.
పంకజ చరణ్దాస్, కేలూచరణ్ మహాపాత్రల వద్ద ఒడిస్సీ నేర్చుకొన్నారు. ఎం.డి.రామనాథన్ దగ్గర కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ శిక్షణ పొందారు. ఈమె తన తొలిప్రదర్శనను తన 17వ యేట చెన్నైలో 1957వ సంవత్సరంలో ఇచ్చారు. ఈమెకు 20 సంవత్సరాల వయసు వచ్చే సమయానికి ఈమె ఒక ప్రతిభావంతురాలైన నర్తకిగా గుర్తింపు పొందారు. ఆ క్రమంలో ఈమె తన నివాసమునుమ ఢిల్లీకి మార్చారు.
వివిధ రకాల నృత్యాలను హేమాహేమీలైన గురువుల వద్ద ఎంత నేర్చుకున్నా, ఈమె తన కళతో ప్రేక్షకులను నిలవేసి "ఇది నా ఒరవడి" అని చాటే ఒకానొక విశిష్ట బాణీ నృత్యాన్ని ప్రదర్శిస్తుంది. ఈమె ఏ బాణీ నృత్యం చేసినా వివిధ నృత్య రీతులను కలగాపులగం చేయకుండా ఆయా నృత్య సంప్రదాయాల పరిధిలోనే తన వ్యక్తిత్వాన్ని అభివ్యక్తం చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నర్తనానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, బర్మా ఇత్యాది ఎన్నోదేశాలు పర్యటించి ఆయా చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య ప్రచారం చేసారు.ఢిల్లీలో నృత్యకౌస్తుభ కల్చరల్ సొసైటి – యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ ఇస్తున్నారు.
"క్షీరసాగరమథన"మనే నృత్యరూపకాన్ని, దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆకాశవాణి కోసం రచించారు.కాని దాన్ని కూచిపూడి సిద్ధేంద్ర



కళాక్షేత్రంలో ప్రసిద్ధ, నాట్యాచార్యుడు – చింతా కృష్ణమూర్తి ప్రిన్సిపల్గా ఉన్న రోజుల్లో అక్కడ ప్రదర్శించ తలపెట్టి ఈ రూపకానికి నృత్యం కూర్చవలసిందిగా ప్రఖ్యాత నర్తకుడు, నాట్యాచార్యుడు వెంపటి చినసత్యంకు అప్పగించారు. అప్పుడు ఆయన నేతృత్వంలో మొట్టమొదట ప్రదర్శించిన "క్షీరసాగరమథనం"లో యామినీ కృష్ణమూర్తి "విశ్వమోహిని" పాత్రలో, ధన్వంతరి, మహావిష్ణువు పాత్రల్లో వేదాంతం సత్యనారాయణ శర్మ నటించి ఈ ప్రదర్శనను రక్తి కట్టించారు. ఆనాటి నుండి ప్రజలు ఈమెను "విశ్వమోహిని" అని సంబోధించడం మొదలు పెట్టారు. తరువాత ఈమె ఈ క్షీరసాగరమథనం నృత్యనాటికను అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ముందు ప్రదర్శించి వారి నుండి "భామావేణీ" బిరుదును అందుకున్నారు. అంతే కాక ఈమె "భామాకలాపం"లో సత్యభామగా అవతరించే వైఖరి, "మండూక శబ్దం"లో కృష్ణదేవరాయల ప్రశస్తిని లీలగా చూపే అభినయం, భంగిమల్లోని రీవి, ఔచిత్యం, "సింహాసనస్థితే" శ్లోకంలో దేవిని కళ్ళకు కట్టిస్తూ పట్టే భంగిమలు, "కృష్ణశబ్దం"లో భావతీవ్రత, లాలిత్యం, వైవిధ్యం ఈమె ప్రతిభకు తార్కాణాలు. వేదాలకు కొన్ని పసందైన జతులతో ఈమె కూర్చిన నృత్యం ఈమె పాండిత్యానికి ఉదాహరణ.

**ప్రతిభకు అనేక పురస్కారాలు**
యామిని సేవలను గుర్తించిన ప్రభుత్వం 1968లో పద్మశ్రీ 2001లో పద్మభూషణ్ 2016లో పద్మవిభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది. సంగీత నాటక అకాడమీ అవార్డు కూడా అందుకొన్నారు.2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. ఆపై యామిని కూచిపూడి నృత్యానికి సంబంధించి డీవీడీలు విడుదల చేసారు. తన నృత్యప్రస్థానాన్ని "రేణుకా ఖాండేకర్" సహకారంతో "ఎ ప్యాషన్ ఆఫ్ డాన్స్" పేరుతో పుస్తకంగా రాసారు. నృత్యకళ పట్ల జనసామాన్యంలో అవగాహన కలిగించడానికి అభిరుచి పెంచడానికి సుమారు మూడేండ్ల పాటు పరిశోధన చేసి "నృత్యమూర్తి" సీరియల్ను పదమూడు భాగాలుగా ఈమె రూపొందించి దూరదర్శన్లో ప్రసారం చేసారు.

**నాట్యరంగానికి పూర్తి జీవితం అంకితం..**
మన సంస్కృతీ వైభవానికి గోపురమై నర్తనశిల్పాల ఆధారంగా, స్థలపురాణాలు, చరిత్ర జోడించి వ్యాఘ్రపాద, పతంజలి సూక్తులు, కర్ణాటక సంగీతం రుచిచూపిస్తూ ఈ సీరియల్లో నృత్య సర్వస్వాన్ని ఇమిడ్చి చూపించారు.2017లో విశాఖపట్నంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారు ఈమెకు స్వర్ణకమలం బహూకరించి "నాట్య విద్యాభారతి" అనే బిరుదును ఇచ్చి సత్కరించారు. న్యూఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు ఈమె డైరెక్టరుగా సేవలను అందించారు. ఈమె వివాహం చేసుకోకుండా అవివాహితగానే వుండి నాట్యరంగానికి తన పూర్తి జీవితాన్ని అంకితం చేసారు.
ఫిలింస్ డివిజన్ ఆఫ్ ఇండియా 1971లో ఏల్చూరి విజయరాఘవ రావు సంగీత దర్శకత్వంలో "యామినీ కృష్ణమూర్తి" పై 20 నిమిషాల ఒక డాక్యుమెంటరీ సినిమా తీసింది. ఈమె ఉత్పలేందు చక్రవర్తి దర్శకత్వంలో వెలువడిన చందనీర్ అనే బెంగాలీ సినిమాలో తన పాత్రలోనే (డా.యామినీ కృష్ణమూర్తి) నటించారు.

## నిన్ను నీవు వదిలేసుకుంటావు..

కన్నీల్లు రాలగానే
దేవుడు ఉలిక్కిపడి లేచిరాడు
కర్మ అనుభవవించనిదే
నలుగురిలో కార్యోణ్ముకునీవి కాలేవు..
ముఖము ఒకవైపేచూస్తుంది
సుఖము దేహాన్ని అనుభవించి విసిరేస్తుంది..
తర్వాత దుఃఖము మొదలవుతుంది..
నీకు....బతుక్కు మధ్య
అతిధిలా దూరము వస్తుంది
నిన్నటి ఆనందాన్ని ఉరితీసి
నువ్వెక్కిన నిచ్చనపైనుంచి పడతోస్తుంది..
నువ్వు నిప్పుల్లో చినుకుల చల్లారిపోతావు..
దేహములో చలనముంటుంది
గుండెదేవిడిలో కలవరమౌతుంది..
కళలు కోల్పోతున్న అడుగులు
కలలను విసర్జించిన కంటి మడుగులు
సాయముఅందించే చేతులకోసము
మెట్లేక్కి దిగుతుంటాయి..
నీ ప్రయత్నము ఒంటరినిచేస్తుంది
నిన్న ఆహ్లాదపు పడవలెక్కితిరిగిన నీ దర్పము
ఈరోజు అలావిసిరిన కాటుకు ఒళ్ళంతా భైర్లు కమ్ముతుంది..
నువ్విప్పుడు చీకటిలో నిలపడిఉంటావు..
చీమంతా సహాయముకోసము
అలికిడైనా దిక్కు ముఖాన్ని తిప్పుతుంటావు..
ముఖలన్నీ ముసుగులు వేసుకుంటాయి
నిన్ను గుర్తుపట్టనట్టు నీముందే తిరుగుతుంటాయి..
నువ్వు వెతికే వెలుగులు
నిన్న నువ్వదిలేసిన పున్నమిలను
రేపటి నీచివరిరోజున మనసారా ఏడ్చి
నిన్ను నీవు వదిలేసుకుంటావు....

- మారుపాక కృష్ణ (త్రిపుర)
90594 74032



మేడ్చల్, నాగారం మున్సిపాలిటీలో సిరినిటీ హై స్కూల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "వన మహోత్సవం" కార్యక్రమంలో పాల్గొన్న మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్



# ఆగిపోయిన రావిచేడు బ్రిడ్జి నిర్మాణం

## స్పందించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, కేశంపేట్ :** కేశంపేట్ మండల కేంద్రంలో రావిచేడ్ రోడ్ లోని రైతులు తమ పంట పోలాలకు అనుసందానంగా ఉన్న ప్రదాన కాలువకి (వాగుకు) బ్రిడ్జ్ నిర్మాణానికి గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బిల్లు సరిపొకపోవడంతో నిర్మాణం సగంలోనే ఆగిపోయింది. కేశంపేట్ మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్ రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, రెండు వైపులకు గోడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అలాగే మిగతా అమౌంట్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాగును సందర్శించిన పంచాయతి రాజ్ డిప్యూటి ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ భూపాల్, మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్ రెడ్డి, యెన్నం శ్రీకాంత్ రెడ్డి, కోడిపర్తి శ్రీకాంత్ రెడ్డి, మాజీ వార్డ్ సభ్యులు మంచె కృష్ణయ్య, దశరథ, కోడిపర్తి రంగారెడ్డి, పిట్టల బాలరాజ్, తలసాని కృష్ణరెడ్డి, రమణా రెడ్డి, బంద స్వామయ్య, తలసాని శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

# పచ్చదనం-పరిశుభ్రతపై సమీక్ష



**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామాల్లో పటిష్టంగా అమలుపరిచి విజయవంతం చేయాలని అమనగల్లు మండల ఎంపీడీఓ కుసుమ మాధురి అన్నారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎం.ఈ.ఓ. సర్దార్ మున్సిపల్ కమిసనర్ వసంత, వైద్యదికారి మంజుల దేవి, ఏపియం వెంకట్ రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామపంచాయతీ కార్యదర్శిల తో కలిసి ఎంపీడీఓ కుసుమ మాధురి స్వచ్ఛ దనం. పచ్చదనం కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పల్లెలను పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేయాలని ఉద్దేశ్యంతో ఈ నెల 5 నుండి స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమం చేపట్టనుందని ఈకార్యక్రమంతో ప్రతి గ్రామం పారిశుధ్యంతో స్వచ్ఛదనం, మొక్కలు నాటడంతో పచ్చదనం సంతరించుకుని గ్రామాల రూపు రేఖలు మారేలా సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు.

# భక్తుల సౌకర్యం కోసం షెడ్డు నిర్మాణం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లోని గుండ్ల పల్లి శ్రీ దుర్గామాత దేవాలయ నిర్మాణ మున కు, శ్రీ బిడారి మైసమ్మ తల్లికి రేకుల షెడ్డు వేయించారు యాదాద్రి మున్సిపల్ చైర్పర్సన్ ఎరుకల సుధా హేమెంధర్ గౌడ్. ఈ కార్యక్ర మంలో గ్రామ పెద్దలు , కుల పెద్దలు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, దికొండ జోగేశా, గంధమల్ల ఉపేందర్ గౌడ్,పెరబోయిన పెంటయ్య యాదవ్, కీసరి బాలరాజ్ గౌడ్, కమలికర్ జహంగీర్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో వ్యాక్సినేషన్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తిమ్మాపురం గ్రామం అంగన్వాడీ కేంద్రంలో శనివారం రోజు చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సాంబులమ్మ పాల్గొనడం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే పిల్లలకు ముర్రు పాలు పట్టించాలని, పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ముర్రు పాలు పిల్లలకు రోగనిరోధక శక్తిని కల్పిస్తాయని అన్నారు. పిల్లలకు, చిన్న పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు టైం ప్రకారం వ్యాక్సిన్ వేయించుకోవాలని అవగాహన కలిపించారు. అనంతరం వ్యాక్సినేషన్ చేసిన ఎఎన్ఎం పరకాల మమత, ఆశకార్యకర్త రాచమల్ల రజిత, అంగన్వాడీ ఆయా నస్రీన్, చిన్నపిల్లల తల్లిదండ్రులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తదితరులు హాజరైనారు.

# ఎస్సీ వర్గీకరణ గొప్ప విజయం

## మంత్రి ఉత్తమ్ పై సైదిరెడ్డి ఆగ్రహం



**విశ్వంభర, సూర్యాపేట:** ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ పోరాటం, ప్రధాని మోడీ సహకారంతో నేడు వర్గీకరణ విజయం సాధించిందని మాజీ ఎమ్మెల్యే బీజేపీ పార్టీ నల్గొండ పార్లమెంట్ ఇంచార్జీ శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణకై అలుపెరగని పోరాటం చేసినందుకు విజయాన్ని ముద్దాడినందుకు, మందకృష్ణ మాదిగకి, ఎస్సీ సామాజిక వర్గం మిత్రులందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని, మొదలు రేషన్ కార్డు ఆధారితం కాదని ఇప్పుడు రేషన్ కార్డును ఆధారంగా చేసుకొని ర్యాతులను మోసం చేస్తూ, నష్టపరిచే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పై దుయ్యబట్టారు. రైతు రుణమాఫీపై బిజెపి పార్టీ పోరాటం చేస్తోందని తెలుపుతూ ఎవరికైతే రైతు రుణమాఫీ కాలేదో వారికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రత్యేకంగా ఒక టోల్ ఫ్రీ 8886100097 నెంబర్ను ఏర్పాటు చేయడం జరిగిందని రుణమాఫీ రాకుండా ఉన్నటువంటి నిజమైన రైతులకి బిజెపి పార్టీ అండగా నిలుస్తుంది అని సైదిరెడ్డి పేర్కొన్నారు. హుజూర్నగర్ లో స్టాండు, ల్యాండు, రాజన్న అక్రమ రేషన్, యదేచ్చగా నడుస్తోందని, అక్రమంగా చెరువులో మట్టి తవ్వుతూ మత్స్యకారులకు ఇబ్బందికరంగా వ్యవహరిస్తున్నారు. సివిల్ సప్లైలో కోట్ల కొద్ది అవినీతి జరిగిందని గతంలో సీజ్ చేసిన ధాన్యాన్ని తరలించడం జరిగిందని ఎటువంటి విచారణ కూడా లేకుండా చేస్తున్నారని, మంత్రి ఉత్తమ్ కుమార్రెడ్డి పేరును వాడుతూ యదేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నట్టు.. దీనిపై వెంటనే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించాలని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ సమావేశంలో మండల, పట్టణ అధ్యక్షులు కోటిరెడ్డి, రవి బీజేపీ నాయకులు సోమిరెడ్డి, జనిగల శ్రీనివాస్, బెల్లంకొండ నాగరాజు, వెంకట శివ, హిందూజా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# మంద కృష్ణతో మాజీ ఎంపీ బీబీ పాటిల్

**విశ్వంభర, న్యూఢిల్లీ :** జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ ఆహ్వానం మేరకు శనివారం నాడు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ బీబీ పాటిల్ వారికి పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఎస్సీ వర్గీకరణకై అలుపెరుగని పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగకు అభినందనలు తెలియజేశారు. ఎస్సీ వర్గీకరణ కోసమే ఎమ్మార్పీఎస్ను స్థాపించి గత 30 ఏళ్లుగా నిర్విరామంగా అలుపెరగని పోరాటం చేసిన మందకృష్ణ మాదిగ పోరాట పటిమను ఈ సందర్భంగా కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం అని అణగారిన వర్గాల దశాబ్దాల పోరాటానికి న్యాయం జరిగింది అని అన్నారు.

# గాంధీ చౌక్‌లో పోలీసుల స్పెషల్ డ్రైవ్



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు మండల కేంద్రంలో సెల్ ఫోన్ దొంగతనాల ను అరికట్టడానికి ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నారు. ఈ మధ్యకాలంలో సెల్ ఫోన్లు పోతున్నాయని ఎక్కువగా ఫిర్యాదులు రావడంతో ఆమనగల్లు మండల కేంద్రంలో శుక్రవారం కూరగాయల సంత కావడంతో రద్దీ విపరీతంగా ఉంటుంది. ఇదే అదనుగా సెల్ ఫోన్ దొంగతనాలు జరుగుతున్నాయని వీటిని అరికట్టడానికి మహాత్మా గాంధీచౌక్‌లో శుక్రవారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేశారు. అత్యంత రద్దీ ఉండే స్థలాల్లో, బ్యాంకుల్లో, బస్టాండ్ లో, కూరగాయల మార్కెట్లో, సినిమా హాల్లో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. అలాగే నెంబర్ ప్లేట్లు లేని హెల్మెట్లు లేని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.




## తస్మాత్తు జాగ్రత్త : ఎస్సై

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి డ్రగ్స్ మరియు సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని సబ్ ఇన్స్పెక్టర్ ఎస్ కృష్ణయ్య తెలిపారు. మెయిన్ రోడ్డు పై ప్రయాణికులకు అవగాహన కల్పిస్తూ, ప్రజలు తమ పరిసర ప్రాంతాలలో ఎవరు అయినా అనుమానస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని అన్నారు. డ్రగ్స్ (మత్తు పదార్థాలు) ,సైబర్ మోసాల పట్ల (ఓటీపీ, ఆన్లైన్ లింక్ సంబంధ) అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాల పై టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫోన్ చేయాలని, ఇళ్లు వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి అని ప్రజలకు సూచించారు.




## ఏఎస్ఐ పేరుతో ఆన్లైన్ మోసం

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ ఠాణా నుంచి ఏఎస్సైని మాట్లాడుతున్నా కానిస్టేబుల్ భార్య పరిస్థితి విషమంగా ఉంది హెూంగార్డు ద్వారా రూ.90,000 డబ్బులు పంపిస్తున్నా, తొందరగా మీరు నా ఖాతాకు ఆన్లైన్ ద్వారా డబ్బులు జమ చేయాలని' మీ సేవా నిర్వాహకుడికి పోన్ వచ్చింది.... నిజమే అనుకొని మీ సేవా నిర్వాహకుడు రూ.90 వేలను ఆన్ లైన్ ద్వారా డబ్బులు జమ చేశాడు. ఎంత సేపటికి హెూంగార్డు ద్వారా డబ్బలు అందకపోవడంతో మీ సేవా నిర్వాహకుడు చీర్ల తిరుపతి మహదేవ పూర్ ఠాణాకు వెళ్లి పోలీసులను అడిగారు. దీంతో పోలీసులు ఇక్కడ ఏఎస్సై అసలు లేరని, మీకు ఎవరు ఫోన్ చేశారో..? మీరు ఎవరికి డబ్బులు పంపారో.. అనడంతో అవాక్కయ్యాడు. విషయంపై పూర్తిగా ఆరా తీయగా ఏఎస్సై పేరుతో సైబర్ మోసగాడు ఎర వేసినట్లు గ్రహించాడు. ఈ ఘటనతో పోలీసులు కూడా ఆశ్చర్యపోయారు. వెంటనే సైబర్ క్రైం ఫోన్ నంబరు 1930కు సమాచారం అందించి ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తున్నామని, కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ పవన్ వెల్లడించారు.

# పల్లెర్లలో మంద కృష్ణ చిత్ర పటానికి పాలాభిషేకం



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్దత సాధనే జీవిత లక్ష్యంగా ఉద్యమాన్ని నిర్మించి సుప్రీం కోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చేలా ఉద్యమాన్ని నడిపిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం ఎమ్మార్పీఎస్ పల్లెర్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకుల సమక్షంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు రాజ్యాంగ ఫలాలు ఎస్సీల లోని 59 ఉప కులాలకు వారి వారి జనాభా దామాషా ప్రకారంగా ఎ బి సి డి ల వర్గీకరణ జరగాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో తెలుగు నేల మీద నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994 జులై 7 న ప్రకాశం జిల్లా ఈదుమూడి అనే గ్రామంలో మొదలైన ఈ మాదిగ దండోరా ఉద్యమం దేశవ్యాప్తంగా విస్తరించి గత మూడు దశాబ్దాలుగా అలుపేరగని పోరాటం సాగిస్తే చివరికి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జిలు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇవ్వటం హర్షనీయమని తెలిపారు . ఈ కార్యక్రమంలోపల్లెర్ల అఖిలపక్ష , ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కూరెళ్ళలో కామ్రేడ్ జానమ్మ మృతి

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ల గ్రామంలో కామ్రేడ్ ఎరుకల జానమ్మ మృతి చెందడం జరిగింది. వారి మృత దేహానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ నాయకులు ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంభానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ పరామర్శించడం జరిగింది

# నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :**కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ లో ఉద్యోగ ఖాళీల గూర్చి లేకపోవడం గమనార్హం అని కేవలం ఆ క్యాలెండర్ ఏ పరీక్ష ఎప్పుడు పెడుతామో, అర్హత అనేది తప్ప మరే మీ లేదని బిఆర్ఎస్వీ మండల కార్యదర్శి కూరెల్ల మణికుమార్ అన్నారు. వాటితో నిరుద్యోగులకు ఒరిగేది ఎంటో చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ యావత్ తెలంగాణ నిరుద్యోగులను వారి అధికార దాహం కోసం వాడుకొని, నేడు కుర్చీలో కూర్చున్న తరువాత వారి సమస్యలు, వారిని పట్టించుకొనే పరిస్థితుల్లో వారు లేరని వాపోయారు. రానున్న రోజుల్లో అదే నిరుద్యోగులు ప్రతి ఎన్నికల్లో మీకు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నరని అని కాంగ్రెస్ ప్రభుత్వం పై మండి పడ్డారు.



# కొమ్ము సింధూరకు ఆర్థిక సాయం

**విశ్వంభర, వెల్దండ :** వెల్దండ మండల పరిధిలోని రాచూర్ గ్రామానికి చెందిన కొమ్ము సింధూర వైద్య విద్యలో మూడవ సంవత్సరం ఎస్వీఎస్ మెడికల్ కళాశాలలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో చదువుతుంది. సింధూరకు నాలుగు సంవత్సరాలకు గాను ప్రతి సంవత్సరం పది వేల రూపాయల ఆర్థిక సాయం చేస్తానని కాంగ్రెస్ నాయకులు సంజీవ్ కుమార్ హామీ ఇచ్చారు. హామీలో భాగంగా మొదటి,రెండవ సంవత్సరాలకు గాను ఇరవై వేల రుపాయల ఆర్థిక సాయం గతంలో అంద జేశారు. మూడవ సంవత్సరానికి గాను శనివారం సింధూర తండ్రి కొమ్ము వెంకటయ్యకు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజే శారు. ఈ కార్యక్రమంలో రమేష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.



## తెలుగు విశ్వవిద్యాలయం
# పేరు మార్పు సరైనది కాదు

**విశ్వంభర, కామారెడ్డి :** కామారెడ్డి జిల్లాలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోత్కూరు శ్రీకాంత్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయాన్ని పేరు మార్పునకు తెలంగాణ ముఖ్యమంత్రి ప్రతిపాదించడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ఈ ప్రతిపాదనను ఏ పార్టీలు కూడా అంగీకరించిన వారిపై శాంతియ-ుతంగా ఉద్యమం చేస్తామని పొట్టి శ్రీరాములు పేరు మార్పు ఎట్టి పరిస్థితిలో ఒప్పుకునేది లేదని వైశ్యులంతా ఒకతాటిపై వచ్చి సంఘటితంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. దయచేసి ముఖ్యమంత్రి మా యొక్క విన్నపాన్ని మన్నించి మార్పుము వెనక్కి తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మోటార్ శ్రీకాంత్, కంచర్ల లింగం, కొక్కొండ రవీందర్, ఆర్యవైశ్య జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గౌరీ శంకర్, రాజేందర్, కూర శ్రీనివాస్, అతిమాముల రమేష్, పాత లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి



**విశ్వంభర, వికారాబాద్ :** ధరణి పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శనివారం వికారాబాద్ ఆర్డీవో కార్యాలయాన్ని, మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాల యంలోని ధరణి సహాయక కేంద్రాన్ని, రికార్డు గదిని కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో పరిశుభ్రంగా ఉండే విధంగా చూసు కోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆసుపత్రికి ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ డిఎంహెచ్ఓ కి తెలిపారు. చికిత్స నిమిత్తం వచ్చిన బాలుడి అనారోగ్యంపై కలెక్టర్ వివారాలు అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్ ఆకస్మిక పర్యటనలో ఆర్డీ వో వాసు చంద్ర, డిఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, తహసిల్దార్ లక్ష్మీనారాయణ లు ఉన్నారు.

## అంబేద్కర్ రాసిన చట్టాలు, శాసనాలే
# నేడు దేశాన్ని నడిపిస్తున్నాయి




**విశ్వంభర, భూపాలపల్లి :** భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ పద్నాలుగు చెప్పినట్టుగా చట్టం ముందు అందరూ సమానమే అని అసమానతలు లేని జీవితాలను అలవాటు చేసుకోవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే. జయరాం రెడ్డి అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జంగేడు ప్రభుత్వ ఉన్నత పాఠాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశం లో ముఖ్య తిధిగా హాజరయిన జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశలో ఉన్నటువంటి కాలం చాల విలువైనదని దాన్ని సక్రమంగా వాడుకొని చదువుకోవాలని, వ్యసనాలకు దూరంగా వుండాలని అన్నారు. రేపటి పని ఈరోజు చేయి, ఈరోజు పని ఇప్పుడే చేయి అన్న సామెతను మనస్సులో నాటుకొని కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జులై ఒకటి నుండి కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని జడ్జి గారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్. చిన్నయ్య , చిలువేరు అశోక్ , మెరుగు రవీందర్ , కంప అక్షయ, ప్రియాంక, దామోదర్, గాయత్రీ, వెంకటస్వామి, అనూష, తిరుపతి పాల్గొన్నారు.

## ఆవాజ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల
# కరపత్రాల ఆవిష్కరణ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో ఆగస్టు 10 , 11 న జరిగే ఆవాజ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల ను జయప్రదం చేయాలని ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో కరపత్రాల విడుదల చేసారు. ఈ సందర్భంగా ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎంఏ ఇక్బాల్, ఎస్కే లతీఫ్ మాట్లాడుతూ శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హాల్ (దివ్య) లో రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ తరగతులు లౌకిక వాద ప్రజాతంత్ర శక్తులు ఈ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని సమాజం ఐక్యంగా నిలపడం కొరకు దేశ ఐక్యతను చాటే విధంగా ఉంటాయని అన్నారు. శిక్షణ తరగతుల మొదటి రోజున ముస్లిం స్వాతంత్ర సమరయోధుల ఫోటో ఎగ్జిబిషన్ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో యువతి యువకులు ప్రజాతంత్ర వాదులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ అజీమోద్దీన్, ఎండీ మోలిసాహబ్, ఎండీ జమాల్, ఎండీ రంజాన్,ఎండీ హారున్ , వృత్తి సంఘం మండలం కన్వర్ వేముల బిక్షం తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిలో మంత్రుల పర్యటన



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపుర మండలం, మైలారం గ్రామ శివార్లలో సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా మంత్రులు దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), వరంగల్ ఎంపీ కడియం కావ్య, టిజిఐఐసి రాష్ట్ర చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డిలు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా చెల్పూర్ జెన్కో క్వార్టర్స్ లోని హెలీ ప్యాడ్ వద్ద ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, ఎస్పీ, మంత్రులకు శాలువాలు కప్పి, బొకేలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభ వద్ద మంత్రులు మాట్లాడుతూ... భూపాలపల్లి య-ువతకు ఇక్కడ ఏర్పాటు కాబోయే ఇండస్ట్రియల్ పార్కుతో చాలామంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అన్నారు. యువతకు స్కిల్ ఇండియా ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలను చూపించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూపాలపల్లి, ములుగు నియోజకవర్గాలకు సాగునీటి అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, త్వరలోనే ఇరిగేషన్ మంత్రితో మాట్లాడి డిపిఆర్ తయారు చేస్తామని అన్నారు. అనంతరం భూపాలపల్లి పట్టణంలోని వంద పడకల ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన డ్రగ్స్ స్టోరేజ్ రూమును, డాక్టర్స్ క్యాంటీన్ మంత్రులు ప్రారంభించారు. అనంతరం అక్కడి నుండి బయలుదేరి కలెక్టరేట్ లోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన అన్ని శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మంత్రులు పాల్గొన్నారు. మంత్రుల పర్యటన విజయవం తం అవ్వడంతో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రజాప్రతినిధులకు, అన్ని శాఖల అధికారులకు, నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, నియోజక వర్గ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించాలి




**విశ్వంభర,భూపాలపల్లి :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర రెవిన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో 3 కోట్ల 60 లక్షల రూపాయలతో నిర్మించిన ఔషధాలు భద్రపరచు గోదాం, 27 లక్షలతో నిర్మించిన వైద్యాధికారుల క్యాంటీన్ ను పార్లమెంట్ సభ్యులు డా కడియం కావ్య, శాసనసభ్యులు గండ్ర సత్య నారాయణ రావు తో కలిసి ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ములుగు, మంథని ప్రాంత ప్రజలు వైద్య సేవలకు వస్తుంటారని కార్పొరేట్ వైద్య సేవలు అందించా లని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, పర్యవేక్షకులు డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ నోట్ల ముఠాను
# అరెస్టు చేసిన పోలీసులు




**విశ్వంభర, మెట్పల్లి:** నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ఆరుగురు వ్యక్తులను మెట్పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు . డి.ఎస్.పి ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం డిఎస్పి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి డి.ఎస్.పి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా తాళ్ల ధర్మారం గ్రామానికి చెందిన సదాల సంజీవ్, జగిత్యాల పట్టణానికి చెందిన బిట్టు శివకుమార్, నిర్మల్ జిల్లాకు చెందిన మగ్గిడి కిషన్, బొంగురాల పుల్లయ్య, కలకుంట గంగారం, మునిమేకల అశోక్, అను ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి సుమారు 7 లక్షల నకిలీ నోట్లను ఒక కారు ఒక ద్విచక్ర వాహనం 6 సెల్ ఫోన్లు ఐదువేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత సంవత్సరం కాలంగా ఇద్దరు చొప్పున ఒక ముఠాగా ఏర్పడి హైదరాబాద్ అదిలాబాద్ కరీంనగర్ జగిత్యాల జిల్లాలలో 10 లక్షల వరకు డబ్బులు లాక్కొని పరారీలో ఉన్నారు. పైన తెలిపిన నిందితులు ఈ నెల ఒకటో తేదీన స్థానిక పెద్ద గుండు వద్ద గల డాబా లో ధాబా యజమాని రాజేందర్ వద్ద లక్ష రూపాయల నగదు లాక్కొని వెళ్లిపోగా రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ నిరంజన్ రెడ్డి ,ఎస్సై చిరంజీవి బృందం గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలలో భాగంగా వెంకట్రావుపేట్ వీరేంద్ర ధాబాలో వీరిని గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించామని డిఎస్పీ తెలిపారు. నకిలీ నోట్ల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న సిఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు చిరంజీవి, రాజు, పోలీస్ సిబ్బందిని డిఎస్పి ఉమామహేశ్వరరావు అభినందించారు.

# విద్యార్థులపై ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు

**ఆత్మహత్యలు చేసుకోవద్దు.. మీకోసం మేమున్నాం : ఎస్పీ**




**విశ్వంభర, వికారాబాద్ :** ఎవరైనా ఆడపిల్లల జోలికి వెళితే కఠినమైన చర్యలు తీసుకుంటామని, ఎవ్వరు కూడ ఎలాంటి ఆత్మహత్యలు చేసుకోవద్దని, ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ లకు పాల్పడిన కఠినపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని వికారాబాద్ జిల్లా ఎస్పీ కే.నారాయణ రెడ్డి హెచ్చరించడం జరిగింది. జిల్లాలో పని చేస్తున్నా షీ టీం, భరోసా సెంటర్, కళాజాత బృందం అధికారులతో సమన్వయ సమావేశం లో శనివారం పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో షీ టీం, కళాజాత బృందం భరోసా కేంద్రం సమన్వయముతో కలసి పని చేయాలని అన్నారు. అధికారులు అందరు అవగాహన కార్యక్రమాలలో పాల్గొని ఎవరైన మహిళలను, బాలికలను ఇబ్బందులకు గురిచేస్తే తమ కోసం షీ టీం అధికారులు అండగా ఉంటారని అన్నారు. ఎవరైనా లైంగిక వేధింపులకు గురి అయితే భరోసా అధికారులు ఉన్నారనే విషయాన్నీ జిల్లాలోని ప్రతి గ్రామ ప్రజలకు తెలియజేసే విధంగా అవగాహనా కార్యక్రమాలు చేయాలనీ, తమ కోసం షీ టీం, భరోసా కేంద్రాలు పని చేస్తున్నాయి అనే విషయం ప్రతి ఒక్కరు తెల్సుకోవాలని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి , డి ఫోర్ సి ( డిస్ట్రిక్ట్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్ ) డీఎస్పీ ప్రశాంత్ రెడ్డి , షీ టీం, భరోసా, కళాజాత బృందం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణ సందర్భంగా ఎమ్మార్పీఎస్ సంబరాలు

**విశ్వంభర, జగిత్యాల :** ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చిన సందర్బంగా జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల్ పెంబట్ల గ్రామంలో ముఖ్య అతిథిగా జిల్లా కో కన్వీనర్ బెజ్జంకి సతీష్ మాదిగ పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొని సంతోషాన్ని వ్యక్తం చేసారు. గత 30 సంవత్సరాలనుండి ఎస్సి వర్గీకరణ లక్ష్య సాధన లో ఎందరో మాదిగలు అమరులు అయినారని, గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2000 సంవత్సరంలో వర్గీకరణ చంద్రబాబు హయాంలో చేశారని గుర్తు చేస్తూ , అప్పుడు 22 వేల ఉద్యోగాలు వచ్చాయని , కొన్ని వ్యతిరేక శక్తులు సుప్రీం కోర్ట్ లో కేసు వేయడం వలన కేసు కొట్టివేశారని ఈ సందర్బంగా గుర్తు చేసారు. మళ్ళీ మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేయడం ,నేటికీ సుప్రీం కోర్ట్ తీర్పు ఇవ్వడం వలన పెంబట్ల గ్రామంలో ఎస్సి వర్గీకరణ సంబురాలు ఘనంగా చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మీసాల చంద్రయ్య, మోదీగం చందు, మీసాల లింగం, బెజ్జంకి రమేష్, మీసాల సురేష్, మోదీగం రమేష్, మోదీగం శేఖర్, మీసాల రాజశేఖర్, మోదీగం తదితరులు పాల్గొన్నారు.



## ప్రశాంతంగా మున్సిపల్ సాధారణ సమావేశం

**విశ్వంభర, వికారాబాద్ :** వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు 41 అంశాలతో కూడిన ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. అలాగే మున్సిపల్ లోని వివిధ వార్డులలో ఉన్న సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తీసుకురావడంతో పాటు పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య సమస్యలపై సలహాలు, సూచనలు కూడా ఇవ్వడం జరిగింది. మున్సిపల్ సాధారణ సమావేశం అనంతరం చైర్ పర్సన్ చాంబర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చైర్ పర్సన్ మంజుల రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపల్ ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తామని అన్నారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ శంషాద్ బేగం, కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దళిత, గిరిజన ఎమ్మెల్యేలపై అసభ్య ప్రచారం

## ఏసీపీకి పిర్యాదు చేసిన ఎమ్మెల్యే డా. రాంచందర్ నాయక్

**విశ్వంభర, హైదరాబాద్:** అసెంబ్లీలో ప్రజాప్రతినిధులు మాట్లాడుతుంటే ప్రజలను తప్పుదోవ పట్టించాలని ఉద్దేశంతో ప్రజాపాలనకు వస్తున్న ఆదరణ చూడలేక కొందరి ప్రజాప్రతినిధుల మాటలను వక్రీకరించి అసభ్యంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులపై తప్పుడు ప్రచారాలు చేసే కార్యక్రమం జరుగుతుంది. అలాగే దళిత గిరిజన ఎమ్మెల్యేలను కావాలనే వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు. అట్టి కార్యక్రమాలను చేపడుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ ఏసిపికి ఫిర్యాదు చేసారు ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఏసిపి మాట్లా డుతూ ప్రజాప్రతినిధుల మీద సోషల్ మీడియాలో కావాలని తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, తప్పుడు ప్రచారాల ను వారిని గుర్తించి వారు కావాలని చేస్తున్నారా లేక ఏదైనా సంస్థలు చేస్తున్నాయా అనేది విచారణ చేపడతామని అన్నారు . అలాగే రాబోయే రోజుల లో ఇలాంటి తప్పులు జరగకుండా చూస్తామని రాష్ట్ర పోలీసు వ్యవస్థ పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామని సైబర్ క్రైమ్ ఏసిపి తెలిపారు.





## యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్

**విశ్వంభర, హైద్రాబాద్ :** కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ,సీఎంరేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పినట్లుగా అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ ప్రకటించడం జరిగిందని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ హర్షం వ్యక్తం చేసారు.నిరుద్యోగులకు ,యువకులకు ఒక భరోసా ఇచ్చేవిధంగా యూపీఎస్సీ తరహాలో జాబ్ క్యాలెండర్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీయేనని కొనియాడారు. సీఎం,డిప్యూటీ సీఎం క్యాబినెట్ మంత్రులకు విద్యార్థి, నిరుద్యోగుల యువకుల పక్షాన ధన్యవాదాలు తెలియచేస్తున్నామని అన్నారు . బీఆర్ఎస్ అధికారంలోకి ఉన్న పది ఏళ్లలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి నిరుద్యోగులని గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. అందుకే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడనికి ప్రచారం చేసి కీలక పాత్ర పోషించిన యువకులు, నిరుద్యోగులు కు వారు అనుకున్న విధంగానే కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన చేస్తుందని అన్నారు.




## ప్రైవేటు టీచర్లపై సీఎం అనుచిత వ్యాఖ్యలు

**విశ్వంభర, హైద్రాబాద్ :** ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు టీచర్లు ఇంటర్ పాసై, డిగ్రీ ఫెయిల్ అయిన వారు, ప్రభుత్వ ఉపాధ్యాయుల అర్హత లో సగం అర్హత లేని వాళ్ళు, ప్రైవేటు పాఠశాలల్లో బోధిస్తున్నారని ప్రవేట్ టీచర్లను కించపరుస్తూ వ్యాఖ్యలు చేయడం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి మూడు లక్షల ప్రవేట్ టీచర్ల మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయటం బాధాకరమని, అన్ని అర్హతలు ఉండి కూడా గత ప్రభుత్వాల నిర్వాకం వల్ల ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ రాక, ఉపాధ్యాయ వృత్తిపై ఉన్నటువంటి ఫ్యాషన్ తో, చాలీచాలని జీతాలు తీసుకుంటూ, ప్రభుత్వ సెలవు దినాలలో కూడా పనిచేస్తూ రాష్ట్ర విద్యాభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులను గుర్తించకపోగా, రాష్ట్ర ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నటువంటి రేవంత్ రెడ్డి ప్రైవేటు ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడడం తెలంగాణ ప్రైవేట్ టీచర్ ఫోరం ముక్తకంఠంతో ఖండిస్తుంది. కనీసం ప్రభుత్వం ద్వారా ప్రైవేటు టీచర్లకు గుర్తింపు కార్డు కూడా లేకుండా కట్టు బానిసలు లాగా ప్రైవేట్ యాజమాన్యాల వద్ద పనిచేస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులకు అండగా నిలవాల్సిన ముఖ్యమంత్రి ఈ విధంగా మాట్లాడడం ప్రైవేట్ టీచర్ల యొక్క మనసులు బాధించబడ్డాయి. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ టీచర్ల సమస్యలను పరిష్కరించి అండగా నిలవాల్సిందిగా ప్రార్థిస్తున్నాము.



హైద్రాబాద్ : ప్రముఖ పారిశ్రామికవేత్త రహీం సూఫీ నివాసంలో శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామిని మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ




## తెలంగాణ సంస్కృతికి ప్రతీక

# సంస్కృతికి ప్రతీక బోనాలు

### చైర్మన్ రాంరెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగని సాహితీ కళాశాల చైర్మన్ డాక్టర్ పి రామ్ రెడ్డి అన్నారు. శనివార కళాశాలలో నిర్వహించిన బోనాల ఉత్సవాల వేడుకలకు ముఖ్య అతిథిగా డాక్టర్ పి రామ్ రెడ్డి హాజరై డైరెక్టర్లు యం.గోవర్ధన్ రెడ్డి, విగ్నేష్‌రెడ్డితో కలిసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాం రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన పల్లె ప్రజల యొక్క సంస్కృతి సాంప్రదాయాలు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందడం తెలుగు ప్రజలందరూ ఎంతో గర్వించదగ్గ విషయమని అని అన్నారు. హైదరాబాద్ మహానగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే బోనాల పండుగ మన సంస్కృతి సాంప్రదాయాలకు నిలువుటద్దంగా నిలిచిందని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ,కళాశాల సిబ్బంది, సాంప్రదాయ బద్ధంగా దుస్తులు ధరించి బోనాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# వయనాడ్ బాధితులను ఆదుకోండి

### సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

**విశ్వంభర, హైద్రాబాద్ :** కనికరంలేని పరిస్థితిని ఎదుర్కొంటున్న వయనాడ్ ప్రకృతి విపత్తు బాధితులను ఆదుకోవడం మన సమిష్టి బాధ్యత అని సిపిఐ జాతీయ కార్యదర్శి డా. కె. నారాయణ అన్నారు. ఊహించని ఘోరమైన వరదలు , కొండచరియలు కనికరం లేకుండా వందలాదిమంది ప్రాణాలను బలికొన్నాయని, ఇది హృదయ విదారకమైన సంఘటన అని ఆవేదన వ్యక్తం చేసారు. హైదరాబాద్, అబిడ్స్ సర్కిల్ నుండి శనివారం సిపిఐ ఆధ్వర్యంలో కేరళ, వయనాడ్ విధ్వంసకర, వరదలు, కొండచరియలు విరిగి పడిన బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ కనుమల వెంట విస్తరించి ఉన్న పచ్చని పర్వత ప్రాంతమైన వయనాడ్, కేరళను సందర్శించే ప్రజలకు ప్రధాన పర్యాటక కేంద్రం అని, దట్టమైన అడవులు, వరి పొలాలు మరియు ఎత్తైన శిఖరాలు కేరళలోని గొప్ప ప్రకృతి దృశ్యాలతో అలంకరించి ఉంటాయని, వీటిని రక్షించుకోవలసిన బాధ్యత మనందరిపైఉందన్నారు. హైదరాబాద్ ప్రజల స్వచ్ఛంద సహాయం వయనాడ్ లో స్థానభ్రంశం చెందిన ప్రజలకు, గాయపడిన వందలాదిమంది బాధితులకు తక్షణ సహాయాన్ని పొందడంలో సహాయపడుతుందని, తెలిపారు.

ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు అండగా నిలవడం దేశ ప్రజల బాధ్యత అని విరాళాలు అందజేయాలని డా. కె.నారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు సలీం ఖాన్, కంపల్లి శ్రీనివాస్, సిపిఐ నగర నేతలు ఆరుట్ల రాజ్ కుమార్, శక్రి బాయి, మహమూద్, చెట్టుకింది శ్రీనివాస్, కొంరెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు



## సీఎంని కలిసిన బీసీ కమిషన్ చైర్మన్

**విశ్వంభర, హైద్రాబాద్ :** తెలంగాణ బీసీ కమిషన్ వివిధ అధ్యయనాలలో భాగంగా కోరే సమాచారాన్ని, వివరాలను వెంటనే అందించి, సహకరించేలా ఆయా ప్రభుత్వ విభాగాలకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు.శుక్రవారం నాడు రాత్రి అసెంబ్లీ లో ముఖ్యమంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేసినట్లు, పలు పత్రాలు అందజేసినట్లు డాక్టర్ వకుళాభరణం తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను నిర్ణయించడానికి గాను ,అలాగే ప్రభుత్వం ఇచ్చిన టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ మేరకు ఆయా ప్రభుత్వ విభాగాలను సమాచారం ఇవ్వాలని బీసీ కమిషన్ ఎప్పటికప్పుడు లేఖలను రాయడం జరుగుతుంది. త్వరగా కమిషన్ కు వివరాలు అందినట్లైతే నివేదికలను సకాలంలో అందజేయడానికి వీలుంటుందని వకుళాభరణం తెలియజేసారు.

## స్వచ్ఛ ధనం పచ్చదనం పై అవగాహన సదస్సు



**విశ్వంభర, మెట్పల్లి :** మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ టీ మోహన్ ఆగస్టు 5 నుండి ఆగస్టు 9 వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం గురించి ఆర్పి లకు, వార్డు ఆఫీసర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని వార్డులలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత చేపట్టి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని పేర్కొన్నారు. మొక్కల పెంపకాన్ని గృహస్థాయిలో, సమాజ స్థాయిలో చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటలక్ష్మి, డి ఈ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు , ముజీబ్, సోమడి శివ, మున్సిపల్ సిబ్బంది వార్డు ఆఫీసర్లు ఆర్పీలు పాల్గొన్నారు.

# మోడీ, మందకృష్ణకు పాలాభిషేకం

**విశ్వంభర, ఎల్బీనగర్ :** ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిన సందర్భంగా ఎల్బీనగర్, హయత్ నగర్, మన్సూరాబాద్ డివిజన్ ప్రాంతాలలో అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మందకృష్ణ మాదిగలకి పాలాభిషేకం చేసారు. మోర్చా అధ్యక్షులు పారంద సాయి నేతృత్వంలో జరిగిన పాలభిషేకం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డితో కలిసి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ 30 ఏండ్లు,3 దశాబ్దాలు అలుపెరగని పోరాటం, ఎన్నో అవమానాలను తట్టుకొని జాతి భవిష్యత్తుకై పోరాడుతూ ఎస్సీ ఎబిసిడి వర్గీకరణను ఆమోదం తెలపాలని ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ , ఎమ్మార్పీఎస్ నాయకులు తో కలసి న్యాయ పోరాట పటిమతో సాధించాలని గత ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మద్దతు తెలిపాలని కోరిన నిమ్మకు నీరెత్తినట్లు కాంగ్రెస్,తెరాస ప్రభుత్వాలు వ్యవహరించిన, తన దృఢ సంకల్పంతో పోరాడి వర్గీకరణను అంతిమ విజయం సాధించారని అన్నారు. అదేవిధంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర కేంద్ర మంత్రులు, జాతీయ మంత్రులు , బిజెపి కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈరోజు వర్గీకరణ అమలు కావడం ఆనందం వ్యక్తం చేస్తూ బాణాసంచాలు కాల్చి, స్వీట్లు తినిపించుకొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, జగన్, శ్రీను, చిరు,యాదయ్య, రామేశ్వర, హరీష్ రెడ్డి, ముత్యం రెడ్డి, కవిత రెడ్డి, శ్రీధర్ గౌడ్, సాయి రామ్ గౌడ్, రాజేష్ గౌడ్, జయతేజ, రోహిత్ రెడ్డి, నర్సిముడు, శ్యామ్ సుందర్ రెడ్డి, ఎల్లా రెడ్డి, రవితేజ, దశరథ్, గోవింద్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, భారత్, సిద్ధార్థ్, సంతోష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## ఎస్సీ వర్గీకరణ ఘనత బీజేపీది కాదు

**విశ్వంభర, హైద్రాబాద్ :** ఎస్సీ వర్గీకరణ ఘనత బీజేపీది కాదని గజ్జల కాంతం అన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాలుగా మాదిగలు పోరాటం చేస్తున్నారని, ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, సుప్రీం కోర్ట్ కు చేరినా మాదిగలకు న్యాయం జరగలేదని అన్నారు. పంజాబ్ ప్రభుత్వం కూడా వర్గీకరణను కోరితే అక్కడ హై కోర్ట్ దీన్ని కొట్టివేసిందని పేర్కొన్నారు.అప్పుడు పంజాబ్ ప్రభుత్వం దాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్ట్ లో కేస్ వేశారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని పోరాటం చేసింది కాబట్టే ఈరోజు న్యాయం జరిగిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కారణం బీజేపీ అని కొందరు మాట్లాడుతున్నారని, అయితే వర్గీకరణ జరగాలని కోరుకుంటే మోదీ పార్లమెంట్లో బిల్ ను ఎందుకు పాస్ చేయలేదంటూ మండి పడ్డారు. ఎస్సీ వర్గీకరణ పోరాటం కొనసాగాలని సీఎం రేవంత్ రెడ్డి సుప్రీం కోర్ట్ కి అడ్వొకేట్లను పంపారని, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టుకలో వాదించేందుకు ఎందుకు చొరవ తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు.



# సమస్యల పరిష్కారానికి కృషి

**విశ్వంభరా, ఎల్బీనగర్ :** ఆర్కే పురం డివిజన్ లోని సమస్యల పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. శనివారము డివిజన్ పరిధిలోని శివపురి కాలనీలో కాలనీ, అపార్ట్మెంట్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు అయినా సీసీ కెమెరా లు, స్ట్రీట్ లైట్, ప్యాచ్ వర్క్ పనులను సొంత నిధులతో పూర్తి చేశారు. ఈ సందర్భంగా శనివారము చిలుక ఉపేందర్ రెడ్డిని శివపురి కాలనీ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా తన సొంత నిధుల తోటే పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. సమస్య ఏది ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేసేందుకు ముందు ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ సభ్యులు రామచంద్ర రెడ్డి, కిషోర్, శశి, రవీందర్ ,నరేందర్, శివాజీ, వాసు, వెంకటేశ్వర్లు

# 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**విశ్వంభర, భద్రాచలం:** ఈనెల 9వ తేదీన జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆదివాసీ గిరిజనులకు సంబంధించిన మహనీయుల విగ్రహాలను పరిశీలించి దానికి సంబంధించిన ఏర్పాట్లు వేగవంతం చేయాలని, ఆదివాసి కమిటీ సభ్యులకు సూచించడం జరిగిందని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శనివారం నాడు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆదేశానుసారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం కార్యక్రమానికి నియమించిన గిరిజన ఆదివాసి ఐక్యచరణ కమిటీ సభ్యులు మరియు ఐటీడీఏ అధికారులు సమన్వయంతో ప్రపంచ ఆదివాసి దినోత్సవం విజయవంతం చేయడానికి ఏర్పాట్లకు సంబంధించిన సన్నాహక కార్యక్రమాన్ని ప్రారంభించి, భద్రాచలం పట్టణంలోని అల్లూరి సీతారామ రాజు, మల్లు దొర, గంటల దొర మరియు బాబాసాహెబ్ అంబేద్కర్,కొమరం భీమ్, రాణి దుర్గాదేవి విగ్రహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ



ఈ సంవత్సరం ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున నివేదికలు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంవో రమణయ్య, టి ఏ శ్రీనివాస్, మేనేజర్ ఆదినారాయణ, పూణెం కృష్ణ, మురల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం మారినా అధికారులు మారడం లేదు

**విశ్వంభర, కొత్తూరు :** ప్రభుత్వం మారిన అధికారుల తీరు మారడం లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తూరు గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అన్ని అనుమతులతో మొదటి అంతస్తు నిర్మించుకున్న పేదలు ఇప్పుడు రెండో అంతస్తు నిర్మించుకుంటుంటే మున్సిపల్ కమిషనర్ అనుమతులు లేవని నిర్మాణాలను ఆపుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల తీరు సమంజసంగా లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని పేదలకు విరుద్ధంగా అధికారులు ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ తీరు మారకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

# కిసాన్ మోర్చా జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం




**విశ్వంభర ,ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా భారతీయ జనతా కిసాన్ మోర్చా ముఖ్యకార్యకర్తల సమావేశం స్థానిక బీజేపీ కార్యాలయంలో కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ వచ్చిన సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలు ఏలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తా అని చెప్పి, కౌలు రైతులకు 15000, ఇందిరమ్మ రైతు భరోసా ఏలాంటి షరతులు లేకుండా ఇవ్వాలన్నారు. రైతు కూలీలకు 12000 రూపాయలు ఇస్తా అని చెప్పి అనేక విధాలుగా రైతులకు హామీలు ఇచ్చి కల్లబొల్లి మాటలతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు చెయ్యాలని త్వరలో జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన రచ్చబండ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. .

# చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఘనంగా పల్లకీ సేవ

**విశ్వంభర, షాద్ నగర్ :** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ, జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో, భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీరామ నామ స్మరణ మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్, సునీల్ పంతులు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి సోమవారం నుంచి మొదలు కానున్న శ్రావణమాసం విశిష్టతను, నియమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, రాములు, రఘు గౌడ్,



రమేష్ ముదిరాజ్, రఘునందన్ రెడ్డి, శ్రీనివాస్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, కృష్ణయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ చారి, శంకరయ్య యాదవ్, వీఆర్వో బచ్చన్న, భజన భక్త బృందం, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఆర్థిక సాయం

**విశ్వంభర ,నారాయణపూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఫోటోగ్రాఫర్ నూతి సైదులు తల్లీ నూతి సత్తమ్మ అనారోగ్యంతో మరణించారు,నిరుపేద కుటుంబంగా భావించి తోటి ఫొటో గ్రాపర్స్ కలిసి వారి కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఫొటో గ్రాపర్స్ మండల అధ్యక్షుడు ఒరుగంటి లింగస్వామి, గౌరవ అధ్యక్షుడు పాలకూర్ల యాదయ్య, ఎస్ కె.పాషా, కొండ శ్రీకాంత్, ఉపాధ్యక్షులు గంగాపురం సాయి గౌడ్,ఫొటో గ్రాఫర్ కమిటీ సభ్యులు ఉప్పారమోని లింగస్వామి,నీళ్ల శివ,నీళ్ల రాజు ,టేకుమట్లా నగేష్, చిలివేరు శేఖర్,బొంగు మధు తదితరులు పాల్గొన్నారు.

# మర్పల్లి తహశీల్దార్‌గా మునిరోద్దీన్

**విశ్వంభర, మర్పల్లి :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల తహశీల్దార్ గా మునిరోద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం మునిరోద్దీన్ యాలాల్ మండలం నుండి మర్పల్లి మండలానికి బదిలీ అయ్యి బాధ్యతలను స్వీకరించారు.



ఈ సందర్భంగా మర్పల్లి మండల నూతన తహసిల్దార్ మునిరోద్దీన్ మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి భూ సమస్యలున్న తమను సంప్రదించాలని, రైతుల సమస్యలను నా పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత మాపై ఉందని ఆయన అన్నారు.

# 5 నుండి స్వచ్ఛదనం- పచ్చదనం

**విశ్వంభర,నారాయణఖేడ్ :** రాష్ట్ర ప్రభుత్వము గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చడానికి తేదీ 05/08/2024 నుండి 09/08/2024 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించిందని. మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ పేర్కొన్నారు ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమ నిర్వహణ కోసం ప్రధానోపాధ్యాయులను ఆదేశించడం జరిగిందని అన్నారు.. పాఠశాల జీవశాస్త్ర, సామాన్య శాస్త్ర, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఉపాధ్యాయురాలు వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలు, పారిశుద్ధ్యం,, మొక్కల పెంపకంపై పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించి, తదుపరి ఉపన్యాస, వ్యాసరచన, పెయింటింగ్, పోటీలు నిర్వహించవలెనని అన్నారు . వన మహోత్సవం పాఠశాలలో ఉన్నటువంటి ఖాళీ స్థలంలో వీలైనన్ని మొక్కలు నాటవలెనని మొక్కలను గ్రామపంచాయతీలో గల నర్సరీ ద్వారా గానీ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ద్వారా కానీ పొందవచ్చునని అన్నారు.



# ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఓ

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం శనివారం రాయిపల్లి, సర్వపల్లి గ్రామాలను ఆకస్మికంగా సందర్శించారు ఎంపిడిఓ రాములు నాయక్. పచ్చదనం పరిశుభ్రత పై ఎక్కువగా ఫోకస్ పెట్టిన ఎంపిడిఓ రాములు నాయక్.వర్కు ఐడి వారిగా మొక్కలకు గుంతలు తీసి మొక్కలు నాటాలని, నాటిన మొక్కలకు నీటిని సరఫరా చేయాలని అన్నారు. నాటిన మొక్కలు ఏదికూడ చనిపోకుండా కాపాడాలని అన్నారు. రాయిపల్లి సర్వపల్లి గ్రామాల్లోనీ నర్సరీలను, మొక్కలు నాటిన కమ్యూనిటీ ప్రాంతాలలోని మొక్కలను పరిశీలించారు. అనంతరం పలు సలహాలు సూచనలు చేశారు. వీరివెంటా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఏఫ్ఏలు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

**విశ్వంభర, నారాయణపూర్ :** ఎస్సీ రిజర్వేషన్ ఫలాలు కొన్ని కులాలకే అనుకూలంగా ఉన్నాయని, ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వలన మాదిగలు, మాదిగ ఉపకులాలు వెనకబడి పోతున్నాయని 1994 లో మహా జననేత మందకృష్ణ మాదిగ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని ప్రారంభించి 1994 నుంచి 2024 వరకు సుమారు 30 సంవత్సరాలు



అలుపెరుగని పోరాటం చేస్తూ మాదిగ ,మాదిగ ఉపకులాల అభ్యున్నతి కోసం తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా నిర్విరామ పోరాటం చేయడం జరిగింది.. ఈ పోరాటంలో ఎందరో మాదిగ బిడ్డలు ప్రాణ త్యాగం చేయడం జరిగింది.. ఎమ్మార్పీఎస్ ఉద్యమం న్యాయమైన కోరికని దీనికి అందరూ సహకరించాలని దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలను ఒక్కతాటిపై తెచ్చి మద్దతు ప్రకటించాలని మందకృష్ణ మాదిగ దేశ మొత్తం తిరగడం జరిగింది.. చివరికి సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణ కేసు విజయం సాధిం చడం జరిగింది.. ఎస్సీ ల వర్గీకరణ న్యాయ మైన కోరిక అని దానిని తక్షణమే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సుప్రీం కోర్టు తుది తీర్పును వెలువరించింది.. సుప్రీంకోర్టు తుది తీర్పు పై హర్షం వ్యక్తం చేస్తూ సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకి ర్యాలీగా వచ్చి స్థానిక అంబేద్కర్ విగ్రహం దగ్గర పాలాభిషేకం చేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, ఎంఎస్ఎఫ్ నాయకులు.. పాల్గొనడం జరిగింది.. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్డేపల్లి రాములు, పొట్ట వెంకటేష్, ముత్యాల చంద్రకాంత్, వలిగొండ యాదయ్య, భాస్కర్, గిరిబాబు పాల్గొన్నారు.

# రెయిన్ బో స్కూల్‌లో విద్యార్థులకు ఫ్రీ స్కాలర్ షిప్ టెస్ట్

**విశ్వంభర, చింతపల్లి :** చింతపల్లి మండలం మాల్ పట్టణ కేంద్రంలోని రెయిన్ బో స్కూల్ లో రెయిన్ బో బెర్నర్స్ లీ ఎడ్యుకేషన్ సొసైటీ అండ్ హ్యాపీ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్స్ రాజ్ కుమార్ సావత్, లూయిస్ విన్సెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం స్కాలర్ షిప్ టెస్ట్ లు నిర్వహించినట్టు రెయిన్బో స్కూల్ డైరెక్టర్ ఖాజా నవాజ్ తెలిపారు. ఆదివారం కూడా విద్యార్థులకు టెస్టులు నిర్వహిస్తునట్టు తెలిపారు. చింతపల్లి మండలంలోని ఆర్థికంగా వెనుకబడిన ఐదుగురు మెరిట్ విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ , వెనుకబడిన ఓసి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫలితాలలో ప్రతిభ కనబరిచిన పిల్లలకు 7, 8, తరగతుల విద్యార్థులకు టెస్టు తర్వాత 8, 9,10 మూడు సంవత్సరాలు ఉచితంగా చదివిస్తామని



రెయిన్బో స్కూల్ డైరెక్టర్ ఖాజా నవాజ్ తెలిపారు. వారి వెంట ప్రిన్సిపాల్ వీరేశం, స్కూల్ సిబ్బంది వున్నారు.



# ఆకట్టుకున్న కేజీబీవీ విద్యార్థుల బాలసభ

**విశ్వంభర, ఆమనగల్లు :** మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శనివారం బాలసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులే గెస్టులుగా డీఈవో, ఎంఈఓ, ఎస్ ఓ పాత్రలతో మెప్పించారు. వారు విద్యార్థులతో డాన్స్, పాటలు, ఉపన్యాస, కథలు చెప్పడం, వంటి కార్యక్రమాలు చిన్నారు లతో చక్కగా నిర్వంచించారు. అందులో మన జీవితంలో తల్లి దండ్రుల పట్ల ప్రేమ, ఆప్యాయత మన నిర్వహించాల్సిన భాధ్యత గురించి వివరించిన విధానం అందరిని ఆకట్టుకుంది. జీవన నైపుణ్యాలను విద్యార్థులు చాల చక్కగా నేర్చుకున్నారు. బాలసభలో ఎస్ ఓ పద్మజ్యోతి, పి ఈ టి సరిత, వాలెంటర్ కవిత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద జీవిత సందేశం పుస్తకాలు పంపిణీ చేసిన యజ్ఞ ఫౌండేషన్

**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు యువత స్ఫూర్తి ప్రధాత స్వామి వివేకానంద జీవితం - సందేశం, సాహిత్యం పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల




ప్రధానో పాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందరూ స్వామి వివేకానంద జీవితం సందేశం పుస్తకం చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు పాలెం వెంకటేష్, యాట మహేందర్, నల్ల ఉదయ్ కిరణ్, నల్ల భూమిక, కాకులారం రాణాప్రతాప్ రెడ్డి, మరియు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం నుంచి స్వచ్ఛదనం - పచ్చదనం

**విశ్వంభర, షాద్ నగర్ :** షాద్ నగర్ మున్సిపాలిటీలో సోమవారం నుంచి నిర్వహించనున్న స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ సమావేశ మందిరంలో కమిషనర్ వెంకన్న తో కలిసి స్వచ్ఛదనం,పచ్చదనం కార్యక్రమంపై కౌన్సిలర్లకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ ఐదు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు స్థానిక ఎస్ హెచ్ జి నాయకులు,లు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో



సమావేశం, ర్యాలీతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

## వయనాడ్ బాధితులకు

# మోహన్ లాల్ రూ.3కోట్ల విరాళం




**విశ్వంభర, వయనాడ్ :** కేరళలోని వయనాడ్ బాధితులకు సాయం చేసేందుకు మాలీవుడ్ సూపర్ స్టార్ మోహన్‌లాల్ స్వయంగా ముందు కొచ్చారు. శనివారం ఆయన టెరిటోరియల్ ఆర్మీ బేస్ క్యాంపునకు చేరుకున్నారు. టెరిటోరి యల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా ఉన్న మోహన్‌లాల్.. విపత్తు ప్రాంతాన్ని సందర్శించి సైనికులతో సమావేశమయ్యారు. సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. బాధితులకు పునరావాసం కల్పించడం కోసం రూ.3 కోట్ల రూపాయలను విరాళం ఇస్తున్నట్లు ప్రకటించా రు మోహన్ లాల్. ప్రస్తుతం మోహన్‌లాల్‌ఆర్మీ దుస్తుల్లో ఉన్న వయనాడ్ పర్యటనకు సంబం ధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.కాగా, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వయనాడ్ బాధితుల కోసం రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. ఆయన భార్య టీకే కమల ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.33, 000 అందించారు. ఇక, కేరళ సీపీఐ(ఎం) ఎమ్మెల్యేలు కూడా తమ నెల జీతం రూ.50,000లను ముఖ్యమంత్రి విపత్తు సహాయ నిధికి విరాళంగా ఇవ్వనున్నామని తెలిపారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ఘటనలో 300 మందికిపైగా మృతి చెందడం యావత్ దేశాన్ని కలచివేస్తోంది. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో పాటు దేశవ్యాప్తంగా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ముందుకువస్తున్నారు. ఇప్పటికే పలువురు నటులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు భారీ విరాళాలు ఇచ్చారు. మరోవైపు,ఆచూకీ గల్లంతైనవారిని గుర్తించడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఎక్కడెక్కడ ఎవరు చిక్కుకుపోయారో తెలుసుకునేందుకు డ్రోన్లు, మొబైల్ ఫోన్ల సిగ్నళ్ల ద్వారా ముమ్మర ప్రయత్నం కొనసాగుతోంది.

## మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండేతో

# ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ భేటీ



**విశ్వంభర, ముంబయి:** 'నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ – శరద్ చంద్ర పవార్ అధ్యక్షుడు శరద్ పవార్ శనివారం మధ్యాహ్నం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను కలిశారు. ముంబయిలోని మలబార్ హిల్స్‌లోగల మహారాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన వర్ష బంగ్లాలో వీరి భేటీ జరిగింది.ఈ సందర్భంగా మరాఠా రిజర్వేషన్‌లతోపాటు రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వీరు చర్చించినట్లు తెలిసింది. అంతకుముందు వర్ష బంగ్లాకు చేరుకున్న శరద్ పవార్‌కు ఏక్‌నాథ్ షిండే పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. త్వరలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికలవేళ కొత్తపొత్తులకు ఏమైనా ప్రయత్నాలు జరుగుతున్నాయా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే మహారాష్ట్రలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి మహాకూటమిగా ఏర్పడి విజయం సాధించాయి. కూటమి సర్కారును ఏర్పాటు చేశాయి. శివసేన చీఫ్ ఉద్ధవ్ థాక్రే ముఖ్యమంత్రి అయ్యారు. అయితే కొన్నాళ్ల తర్వాత బీజేపీ కుట్రచేసి శివసేనను చీల్చింది. ఏక్‌నాథ్ షిండే వర్గం బీజేపీతో జట్టుకట్టింది. అందుకు ప్రతిగా బీజేపీ.. షిండేను సీఎంను చేసింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నేకర్ డిప్యూటీ సీఎం అయ్యారు. అంతటితో ఆగని బీజేపీ ఆ తర్వాత ఎన్సీపీని కూడా చీల్చింది.

తన కొడుకు అయిన అజిత్ పవార్.. శరద్ పవార్‌కు హ్యాండిచ్చి బీజేపీతో చేతులు కలిపాడు. అందుకు ప్రతిఫలంగా బీజేపీ.. అజిత్‌పవార్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. అయితే ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేనకు, అజిత్‌పవార్ వర్గం ఎన్సీపీకి ఝలక్ ఇచ్చారు. వారికి ఒకటి అరా సీట్లు మాత్రమే కట్టబెట్టారు.

## కేరళలో గోహత్యల వల్లే

# వయనాడ్ విలయం

### బీజేపీ సీనియర్ నేత వివాదస్పద వ్యాఖ్యలు



**జైపూర్:** బీజేపీ సీనియర్ నేత వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. కేరళలో గోహత్యలు జరుగుతాయని అన్నారు. అందుకే వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన విలయంలో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. గోహత్యలు ఎక్కడ జరిగినా ఇలాంటి దుర్ఘటనలు జరుగుతూనే ఉంటాయని చెప్పారు. రాజస్థాన్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నేత జ్ఞానదేవ్ అహుజా శనివారం మీడియాతో మాట్లాడారు. కేరళలోని వయనాడ్ విషాదాన్ని గోహత్యలతో ముడిపెట్టారు. కేరళలో ఆవులను వధిస్తారని తెలిపారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన విలయం దీనికి ప్రత్యక్ష పర్యవసానమని చెప్పారు. కేరళలో ఈ ఆచారాన్ని ఆపకపోతే ఇలాంటి విషాదాలు కొనసాగుతాయని ఆయన అన్నారు.కాగా, గోహత్యలకు పాల్పడిన పలు ప్రాంతాల్లో కేరళ తరహా దుర్ఘటనలు జరుగుతున్నట్లు 2018 నుంచి తాము గమనించామని జ్ఞానదేవ్ అహుజా తెలిపారు. అయితే ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాలలో కొండచరియలు విరిగిపడటం, తరచుగా విపత్తులు సంభవించడానికి గోహత్యలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల అక్కడ విపత్తులు సంభవిస్తాయని అన్నారు.

# మూసీ నది ప్రక్షాళనలో ముందడుగు

- ఎస్టీపీల నిర్మాణానికి రూ.3,849 కోట్లు
- పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో మురికికూపంగా మారిన మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం, ఆ దిశగా ముందడుగు వేసింది. మూసీకి పునర్జీవం వచ్చేలా నదిని శుద్ధి చేసేందుకు కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మించనుంది. ఇందుకోసం జలమండలికి పరిపాలన అనుమతులిస్తూ రూ.3,849.10 కోట్లను కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. మూసీ నది అభివృద్ధి కోసం ఇటీవల బడ్జెట్‌లో రూ. 1500 కోట్లను కేటాయిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం, ఆ నిధులతో మూసీ నది తీరప్రాంత పర్యావరణ వ్యవస్థను పునరుద్ధరించనున్నట్లు ప్రకటించింది. రాజధాని పరిధిలో సుమారు 56 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిలోకి పరివాహక ప్రాంతాల్లోని కాలనీల నుంచి డ్రైనేజీ, వ్యర్థాలతో ఏళ్ల తరబడి మూసీనది కాలుష్య కోరల్లో చిక్కిందని తెలిపిన ప్రభుత్వం, దాన్ని సవాల్ తీసుకొని ప్రక్షాళన దిశగా కార్యచరణ మొదలుపెట్టింది. మూడు ప్యాకేజీలుగా 39 ఎస్టీపీలను నిర్మించనున్న సీవరేజ్ బోర్డు : అందులో భాగంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. తాజాగా అమృత్ 2.0లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చింది. జీహెచ్ఎంసీ, ఓఆర్ఆర్ పరిధిలో 39 ఎస్టీపీలను మూడు ప్యాకేజీల్లో నిర్మించి మురుగును మూసీలో కలువకుండా చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో 64 కోట్ల రూపాయలతో ఒక ఎస్టీపీ, హామ్ పద్ధతిలో 1878 కోట్లతో ప్యాకేజీ-1లో 16 ఎస్టీపీలు, 1906 కోట్లతో ప్యాకేజీ-2లో 22 ఎస్టీపీలను నిర్మించనుంది. ఈ 39 ఎస్టీపీలు అందుబాటులోకి వస్తే 972 ఎంఎల్‌డీల మురుగునీటిని శుద్ధి చేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే వీటికి టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టనున్నారు. మరోవైపు నదికి దక్షిణం వైపున రూ.1297 కోట్ల వ్యయంతో నాలుగు ప్రాంతాల్లో ఐదు శుద్ధి కేంద్రాలు నిర్మాణం జరుగుతోంది. వాటిలో కోకాపేట, మీరాలంలో రెండు కేంద్రాలు అందుబాటులోకి రాగా, ఆయా కేంద్రాల ద్వారా నిత్యం 56.50 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. అలాగే జలమండలి పర్యవేక్షణలో 468 కోట్ల రూపాయల వ్యయంతో నాగోలులో నిర్మించిన అతిపెద్ద ఎస్టీపీ పనులు పూర్తై ప్రారంభానికి సిద్ధమైంది. నాగోలు ఎస్టీపీ ద్వారా 320 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసి నదిలోకి వదులుతారు.

## ఆటో కారు ఢీ ఒకరి మృతి

**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెంట తండా గేటు దగ్గర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బాణవత్ రమేశ్(40) అమంగల్ మండలం పులిగోనిపల్లి తండాకు చెందిన వ్యక్తి మరణించాడు. ఇతను సీతారాం నగర్ తండా ఆమనగల్ నుంచి పులిగోనిపల్లి తండా వైపు ఆటోలో వెళ్తుండగా.. హైదరాబాద్ నుంచి జాతీయ రహదారిపై శ్రీశైలం వైపు వెళుతున్న కారు ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సీత ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ధవాఖానకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

## కుల గణనకై షెడ్యూల్ ప్రకటించాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

**విశ్వంభర, అంబర్‌పేట్ :** తక్షణమే కుల గణన షెడ్యూల్ ప్రకటించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యం ఆధ్వర్యంలో విద్యానగర్లోని బీసీ భవన్‌లో నిరసన దీక్షను చేపట్టారు. నిరసన కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ చిరంజీవి, సమాజ్ వాదీ పార్టీ ప్రో.సింహాద్రి, బీసీ నాయకులు నీల వెంకటేశ్, వేముల రామకృష్ణ, గువ్వల భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య, ఎర్ర సత్యనారాయణ, గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు 42% వరకు బీసీ రిజర్వేషన్లు పెంచిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చాలనిన్నారు.పెంచిన రిజర్వేషన్ల రక్షణకై షెడ్యూల్ 9లో పెట్టాలన్నారు. రాష్ట్రం, కేంద్రం కులగననను చేసి చట్టసభల్లో 50% రిజర్వేషన్లు ఇవ్వకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి కేంద్రం, రాష్ట్రంలో మంత్రులను ప్రజా ప్రతినిధులను తిరగనివ్వమని హెచ్చరించారు.

## వైభవంగా పదవీ విరమణ మంగళా శాసనము



**విశ్వంభర, యదాద్రి:** శ్రీమాన్ పరాంకుశం భాస్కరాచార్యులు యాదాద్రి దేవస్థానంలో ముఖ్య అర్చకుడిగా లక్ష్మీ నృసింహస్వామి సేవలు చేస్తూ పలువురి ప్రశంసలు అందుకున్నారు. ధన్వంతరి సభా వేదికపై ఏర్పటు చేసిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో భాగంగా సుదర్శన ఇష్టి - వేదం ఆశీర్వచనం చేశారు. కార్యక్రమ వ్యాఖ్యాతగా %ఎ%3 న్యూస్ ఛానల్ ఆధ్యాత్మికవేత్త మాధవ శేష స్వామి, ధన్వంతరి దేవాలయం అధినేత కాటూరి శ్రీను, స్వామి, కిష్టాపురం సర్పంచ్ గట్టు నరసింహా చార్యులు, గట్టు కేశవాచార్యులు, అపోలో వెంకటాచార్యులు, మోటపల్లి గిరిస్వామి, కాటూరి రామా సీతా రామానుజాచార్యులు, పలు దేవాలయ అర్చకులు పాల్గొని రామా భాస్కరాచార్యులును సన్మానించి దీవించి ఆశీర్వదించారు.

# అంగన్వాడీ కేంద్రాలలో అన్న ప్రాసన



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** పెద్ద శంకరంపేట మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని అంగన్వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు.. శనివారం పెద్ద శంకరంపేటలోని పూసల గల్లి అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్న ప్రసాన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా అంగన్వాడి ఉపాధ్యాయిని సరళ మాట్లాడుతూ మెత్తని ఆహారం నుండి కొద్దిగా ఘన ఆహారాన్ని రోజుకు మూడు నాలుగు సార్లు చిన్నారులకు ఇవ్వాలని అన్నారు . కిచిడి లాంటి ఆహారం పిల్లలకు పరిచయం చేయాలని అన్నారు . తృణ ధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు, నూనె, నెయ్యి, ఉడికించిన పప్పు, చేపలను మెత్తగా చేసి పిల్లలకి ఇవ్వాలని అన్నారు ఉడికించిన గుడ్డు విధిగా ఇవ్వాలని పేర్కొన్నారు.

## రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పెద్దశంకరపేట ఎస్సై శంకర్ పేర్కొన్నారు.. శనివారం పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ బాలల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత జీవితానికి భద్రత అనే అంశంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.. వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు తప్పనిసరిగా వాడాలన్నారు.. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని విద్యార్థులకు రహదారి నిబంధనల గురించి పలు విషయాలపై అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఏ ఐ శంకరంపేట్ ప్రాజెక్టు లిమిటెడ్ ఐఎంఎస్ మేనేజర్ కాజా మొహీనుద్దీన్, పోలీస్ సిబ్బంది ,ఎన్ హెచ్ ఎ ఐ సిబ్బంది. ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో యూపీఎస్సీ అభ్యర్థిని ఆత్మహత్య

### చాలా విసిగిపోయానంటూ నోట్

**ఢిల్లీ:** ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లో గల ఓ కోచింగ్ సెంటర్‌లోకి ( వరద నీరు ప్రవేశించి ముగ్గురు విద్యార్థులు మరణించిన విషయం తెలిసిందే. రావూస్ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటన మరవకముందే అదే ప్రాంతంలో సివిల్ సర్వీసెస్ అభ్యర్థిని తాజాగా ఆత్మహత్య చేసుకుంది.మహారాష్ట్రకు చెందిన అంజలి అనే విద్యార్థిని గత కొన్ని రోజులుగా ఢిల్లీలోని ఓల్డ్ రాజేందర్ నగర్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ.. సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో తీవ్ర ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు బలవన్మరణానికి ముందు ఓ నోట్‌కూడా రాసి పెట్టింది. 'మమ్మీ, పాపా.. నన్ను క్షమించండి. నిజంగా నేను చాలా విసిగిపోయాను. ఇక్కడ కేవలం సమస్యలు మాత్రమే ఉన్నాయి. డిప్రెషన్ నుంచి బయటపడేందుకు సాధ్యమైనంత వరకూ ప్రయత్నించాను. కానీ, నా వల్ల కాలేదు' అని సూసైడ్ నోట్ రాసి పెట్టి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటనపై అంజలి స్నేహితురాలు శ్వేత మాట్లాడుతూ.. 'అంజలి యూపీఎస్సీ ఎగ్జామ్‌ను మూడు సార్లు ప్రయత్నించారు. కానీ పరీక్షల్లో ఫలితం రాలేదు. దీంతో తీవ్రమైన ఒత్తిడికి లోనైంది. దానికి తోడు కొన్ని నెలలుగా పీజీల్లో అద్దె కూడా పెరుగుతుండటంతో ఆర్థిక పరిస్థితులు తనని చుట్టుముట్టాయి' అని తెలిపింది. మరోవైపు ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద సంఘటనకు దారితీసిన పరిస్థితులపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా, శనివారం రాత్రి 7 గంటల సమయంలో రావుస్ స్టడీ సర్కిల్ బేస్‌మెంట్‌లోకి ఒక్కసారిగా వరద నీరు చేరింది. ఈ సమయంలో బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో దాదాపు 18 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది ఎలాగోలా బయటపడగా, ముగ్గురు మాత్రం నీటిలో మునిగిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఢిల్లీ అగ్నిమాపక శాఖ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ఘటనలో తెలంగాణలోని మంచిర్యాల జిల్లాకు చెందిన తాన్యా సోని(21), ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్‌కు చెందిన శ్రేయ యాదవ్(25), కేరళలోని ఎర్నాకుళంకు చెందిన నవీన్ దల్విన్(29) వరదనీటిలో మునిగి మరణించారు. లైబ్రరీ డోర్‌కు బయోమెట్రిక్ వ్యవస్థ ఉందని, ఇది లాక్ అయిపోవడం వల్లే వీరు బయటకు రాలేకపోయారని పలువురు విద్యార్థులు చెప్తున్నారు.



## పదవి లేకపోవడం వల్ల
# ఏమీ చేయలేకపోతున్నా

- టీడీపీ అధికారంలోకి వచ్చాక నాకు న్యాయం జరగలేదు..
- బుద్ధా వెంకన్న వ్యాఖ్యలు

**విశ్వంభర, విజయవాడ :** టీడీపీ నేత బుద్ధా వెంకన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని బర్త్ డే సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని తన కార్యాలయంలో బుద్ధా వెంకన్న భారీ కేక్ కట్‌చేశారు. అనంతరం చిన్నికి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా బుద్ధా వెంకన్న మాట్లాడుతూ.. పదవి లేకపోవడం వల్ల ఏమీ చేయలేకపోతున్నా అని చెప్పారు. 2024లో చంద్రబాబుకు రక్తంతో అభిషేకం చేసినా తనకు టికెట్ రాలేదని బుద్ధా వెంకన్న తెలిపారు. పదవి లేకపోవడంతో ఎప్పుడు కార్యకర్తలకు న్యాయం చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐల బదిలీ విషయంలో తన మాట చెల్లలేదని చెప్పారు. సీఐల బదిలీ విషయంలో ఎమ్మెల్యేల మాటనే నెగ్గిందని.. వాళ్లు చెప్పిన వారికి పని జరిగిందని అన్నారు. ప్రస్తుతం తాను మాత్రం ఇతరులపై ఆధారపడి ఉండాల్సి వస్తుందని బాధపడ్డారు. వైసీపీ పాలనలో తాను అనేక పోరాటాలు చేశానని బుద్ధా వెంకన్న గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో తనపై 37 కేసులు పెట్టారని చెప్పారు. తనతో పాటు కార్యకర్తలపై కూడా కేసులు పెట్టారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలకు న్యాయం చేయాలంటే ఎమ్మెల్యేగా ఉండాలని ఇప్పుడు అర్థమైందని అన్నారు. 2029లో ఎలాగైనా సరే పోరాటం చేసి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు, నారా లోకేశ్ గురించి కొడాలి నాని, పేర్ని నాని, వల్లభనేని వంశీలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తానే స్పందించానని బుద్ధా వెంకన్న గుర్తు చేశారు. వల్లభనేని వంశీ చంద్రబాబును తిడితే తాను స్పందించి కౌంటరిస్తే గన్నవరంలో తనపై కేసులు పెట్టారని అన్నారు. చంద్రబాబు ఇంటిపై జోగి రమేశ్ దాడికి వెళ్లినప్పుడు కూడా తానే స్పందించానని చెప్పారు.

ఇప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేసిన వారందరూ అప్పుడు ఏమయ్యారని బుద్ధా వెంకన్న నిలదీశారు. ఇదంతా తాను వ్యతిరేకతతో కాదు ఆవేదనతో అడుగుతున్నానని స్పష్టం చేశారు. తన ఆవేద నను టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ కేశినేని చిన్నిని విజ్ఞప్తి చేశారు.

## షణ్ముఖ వ్యూహం పథకాలను కూడా
# వెంటనే అమలు చేయాలి

### చంద్రబాబు, పవన్‌కు హరిరామ జోగయ్య లేఖ



**విశ్వంభర, అమరావతి :** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కాపు బలిజ సంక్షేమ నాయకుడు చేగొండి హరిరామ జోగయ్య సంచలన లేఖ రాశారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలతో పాటు జనసేన హామీ ఇచ్చిన షణ్ముఖ వ్యూహం పథకాలను కూడా వెంటనే అమలు చేయాలని ఆయన కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో పాటు షణ్ముఖ వ్యూహంలోని పథకాలు కూడా ప్రజలకు ఎంతగానో ఉపయోగకరమైనవని హరిరామ జోగయ్య అభిప్రాయపడ్డారు. వీటిని సూపర్ సిక్స్ పథకాలతోనే అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. జనసేన షణ్ముఖ వ్యూహం హామీల్లో ఒకటైన యువకులకు రూ. 10 లక్షల వరకు రాయితీ ఇచ్చే సౌభాగ్య పథకం బృహత్తరమైనదని ఆయన పేర్కొన్నారు. సంపద చేకూర్చే ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు రెండు నెలలు అవుతుంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్నారు. కానీ ఎన్నికల సమయంలో జనసేన ఇచ్చిన షణ్ముఖ వ్యూహం హామీలను మాత్రం పక్కనపడేశారు. జనసేనాని పవన్ కల్యాణ్ సైతం దీని గురించి ఎక్కడా ప్రస్తావించడం లేదు. ఇలాంటి సమయంలో షణ్ముఖ వ్యూహం హామీలను హరిరామ జోగయ్య ప్రకటించడం సంచలనంగా మారింది.

## ఒకే కుటుంబంలో నలుగురు మృతి..
# చంద్రబాబు విచారం



**విశ్వంభర, అమరావతి :** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చిన్నవంగలి గ్రామంలో మట్టి మిద్దె కూలి ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఇంట్లో నిద్రిస్తున్న కుటుంబంపై అర్ధరాత్రి మట్టిమిద్దె కూలడంతో తల్లపురెడ్డి గురుశేఖర్తో పాటు ఆయన భార్య, ఇద్దరు పిల్లలు మృతి చెందారు. గురుశేఖర్ రెండో కుమార్తె ప్రసన్న ప్రొద్దుటూరులో పదో తరగతి చదువుతోంది. రాత్రికి రాత్రి కుటుంబంలో తల్లిదండ్రులు సహా తోబుట్టువులు చనిపోవడంతో ప్రసన్న అనాథ అయ్యింది. ఈ ఘటనపై సమాచారం తెప్పించుకున్న ముఖ్యమంత్రి.. ప్రసన్నకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరఫున రూ. 10లక్షల సాయం ప్రకటించారు. ప్రస్తుతం ప్రసన్న.. తన నాయనమ్మ నాగమ్మ సమక్షంలో ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ప్రసన్న పేరుతో రూ. 10లక్షలు డిపాజిట్ చేయడంతో పాటు, వృద్ధురాలైన నాగమ్మకు రూ. 2లక్షలు సాయం అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు ఆ బాలికను కలిసి ధైర్యం చెప్పాలని సూచించారు. మరోవైపు పార్టీ పరంగా కూడా ప్రసన్నకు బాసటగా నిలుస్తామన్నారు. బాలిక సంరక్షణ, విద్య విషయంలో పార్టీ నుంచి కూడా అండగా ఉంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.



## శ్రీశైలం జలాశయం నుంచి
# కొనసాగుతున్న నీటి విడుదల

**విశ్వంభర, శ్రీశైలం :** తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా జూరాల, సుంకేశుల నుంచి శ్రీశైలం జలాశయానికి 4.54 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తుంది. దీంతో జలాశయం 10 గేట్లను 20 అడుగుల వరకు ఎత్తి స్పిల్‌వే ద్వారా 4.64 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులకు గాను ప్రస్తుతం 883.8 అడుగుల వరకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 215.8 టీఎంసీలకు గాను ప్రస్తుతం 204.7 టీఎంసీల వరకు నీరు నిలువు ఉందని అధికారులు వివరించారు. శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి చేసి 61, 761 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్ జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుంది. ఈ ప్రాజెక్టుకు 4.19 లక్షల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా 34వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి నీటిమట్టం 590 అడుగులకు గాను 558.6 అడుగులకు వరకు నీరు వచ్చి చేరింది. జలాశయం సామర్థ్యం 312.5 టీఎంసీలకు గాను 229.1 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

## మోదీకి కనీసం
# చీమైనా కుట్టినట్లు లేదు

### బతికిస్తున్నారా.. చంపేయాలని చూస్తున్నారా..
### కేంద్రంపై కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలు షర్మిల ఫైర్



**విశ్వంభర, వైజాగ్ :** వైజాగ్ స్టీల్ ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం వైఖరిపై కాంగ్రెస్ ఏపీ అధ్యక్షురాలు నిప్పులు చెరిగారు. విశాఖ ఉక్కును ప్రేవేటీకరించమని చెప్పి దాన్ని బతికించారా? లేక నిధులు ఇవ్వకుండా చంపాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. అమ్మ పెట్టదు అడుక్కు తిననివ్వదు అనే సామెతలా కేంద్ర తీరు ఉందని మండిపడ్డారు. ఆరు వేల కోట్ల అప్పుల్లో ఉన్నామని, ఉక్కు తయారీకి ముడిపదార్థాలు నిండుకున్నాయని, కొనేందుకు చిల్లగవ్వ కూడా లేదని, ఈ నెల జీతాలు కూడా ఇవ్వడం కష్టమేనని యాజమాన్యం చేతులెత్తేస్తుంటే.. మోదీకి కనీసం చీమైనా కుట్టినట్లు లేదని షర్మిల మండిపడ్డారు. పోనీ అప్పు తెద్దామా అంటే గ్యారంటీకి కూడా కనికరం లేదని అన్నారు. ఏపీ ఎంపీల మద్దతుతో మూడోసారి గద్దెనెక్కిన మోదీ.. ఆంధ్రుల తలమానికమైన విశాఖ ఉక్కుపై డబుల్ గేమ్ ఆడుతున్నారని షర్మిల విమర్శించారు. లేదు లేదు అంటూనే ఆయన దోస్తులకు విశాఖ ఉక్కును కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని ఆరోపిచంఆరు. కుక్కను చంపాలంటే దానిపై పిచ్చిదనే ముద్ర వేసినట్లుగా.. విశాఖ స్టీల్‌కు ఒక్క రూపాయి సహాయం చేయకుండా వెంటిలేటర్ మీదకు నెట్టారని అన్నారు. నిధులు ఇవ్వకుండా సైలెంట్‌గా విశాఖ ఉక్కును నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. త్వరలోనే అదానీ, అంబానీ, జిందాల్ వంటి వాళ్లకు విశాఖ ఉక్కును కట్టబెట్టే ముహూర్తం కూడా ఫిక్స్ చేశారని పేర్కొన్నారు. ఏపీ బీజేపీ నేతలను, కూటమిలో భాగస్వామ్యమైన టీడీపీ, జనసేన పార్టీలను హెచ్చరించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ లేకుంటే.. ప్లాంట్ బలోపేతంపై మీకు చిత్తశుద్ధి ఉంటే.. తక్షణం ఆర్థిక సాయం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌కు కావాల్సిన ముడి పదార్థాలు వెంటనే సమకూర్చాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్లాంట్‌కు పునర్వైభవం తీసుకురావాలని డిమాండ్ చేశారు.

## అక్టోబర్ 4 నుంచి
## తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**విశ్వంభర, తిరుమల:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రెండు నెలల సమయం ఉన్నందున.. 'అత్యంతవైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాటపై అన్నమయ్య భవన్లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇంజినీరింగ్ పనులు. వాహనాల ఫిట్నెస్, లడ్డూల బఫర్ స్టాక్, అన్నప్రసాదం, దర్శనం, వసతి, కళా బృందాల కార్యక్రమాలు, ఉద్యానశాఖ, ట్రాన్స్పోర్ట్, కల్యాణ కట్ట, గోశాల, శ్రీవారి సేవకులు, విజిలెన్స్ విభాగం భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా.. అక్టోబరు 4న ధ్వాజారోహణం, 8న గరుడ సేవ, 9న స్వర్ణరథం, 11న రథోత్సవం, 12న చక్రస్నానం నిర్వహిస్తారు. వాహన సేవలు ప్రతిరోజూ ఉదయం 8గంటలకు, సాయంత్రం 7గంటలకు ప్రారంభమవుతాయి. సాధారణంగా గరుడ సేవ రోజున భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అక్టోబరు 7న రాత్రి 11 గంటల నుంచి అక్టోబరు 8 అర్ధరాత్రి వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలపై నిషేధం అమలు కానుంది. వార్షిక బ్రహ్మోత్సవాలు జరిగే సమయంలో ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను రద్దు చేయనుంది.

## శ్రీశైలంలో వీరభద్రుడికి విశేష పూజలు

**శ్రీశైలం :** జ్యోతిర్లింగ క్షేత్రం, శక్తిపీఠమైన శ్రీశైల దేవస్థానం క్షేత్రపాలకుడైన బయలువీరభద్రుడికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరణు ఘోషలతో క్షేత్రం మార-ుమోగింది. అమావాస్య సందర్భంగా ప్రదోషకాలంలో వీరభద్రుడికి పంచామృతాలు, ఫలోదకాలు, పసుపు కుంకుమ, విభూది, గంధ జలాలు, బిల్వోదక సుగంధ ద్రవ్యాలు, శుద్ధ జలాలతో అభిషేకాలు, విశేష పుష్పార్చన, మహా నైవేద్యం సమర్పించారు. లోక కల్యాణం కోసం ప్రతి మంగళ, అమావాస్య రోజుల్లో వీరభద్రుడికి అభిషేకం, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. అంతకు ముందు కార్యక్రమం నిర్విఘనంగా సాగాలని మహాగణపతి పూజ నిర్వహించారు. ఇక ఆరుబయట ఆలయంలో దర్శనమిచ్చే వీరభద్రుడిని పూజిస్తే భూతప్రేత, పిశాచ, దుష్టగ్రహదోషాలు తొలిగి సర్వకార్యానుకూలతతో పాటు ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని పండితులు పేర్కొన్నారు. పరీక్షసేవ ద్వారా 17 మంది భక్తులు విశేష పూజల్లో పాల్గొన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, పంజాబ్‌కు చెందిన భక్తులు పాల్గొన్నారు. ప్రతి నెలా వచ్చే అమావాస్య రోజుల్లో సేవాకర్తలు తమ గోత్రనామాలను srisailadevasthanam.org వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఆలయ ఈవో పెద్దిరాజు కోరారు. వివరాలకు దేవస్థానానికి చెందిన 8333901351 / 52 / 53 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



## శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకున్న నారా భువనేశ్వరి

**విశ్వంభర, శ్రీశైలం :** ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శనివారం నంద్యాల జిల్లా శ్రీశైలం మహాక్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భువనేశ్వరికి ఆలయ మర్యాదలతో ఈవో పెద్దిరాజు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమర్చాన పూజలు చేశారు. అనంతరం అర్చకులు వేదాశీర్వాదం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.



## వైసీపీ కార్యకర్తలను
# జైల్లో పెడుతున్నారు

- శునకానందం పొందుతున్న టీడీపీ నాయకులు : మాజీ మంత్రి పేర్నినాని

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో వైసీపీ నాయకులపై అక్రమ కేసులు, తప్పుడు ఆరోపణలు చేస్తూ టీడీపీ నాయకులు శునకానందం పొందుతున్నారని మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు పేర్నినాని ఆరోపించారు. కూటమి చేస్తున్న మోసాలను ప్రజలకు చేరవేసేందుకు ప్రజా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. నూజివీడు జైలులో ఉన్న వైసీపీ కార్యకర్తలను శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలను, నాయకులను లక్ష్యంగా చేసుకుని పాత కేసులను తిరగదోడి అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల బాగోగులను పట్టించుకోకుండా వైసీపీ కార్యకర్తలను జైల్లో పెడుతు న్నారని ఆరోపించారు. అమరావతి, అభివృద్ధి, సంపద సృష్టి అంటూ కాకమ్మ కబుర్లు చెబుతూ తెరచాటున మట్టి, ఇసుక దోపిడి, లేఅవుట్ల పేరుతో దోపిడి చేస్తున్నారని విమర్శిం ఓచారు. వల్లభనేని వంశీపై అన్యా యంగా కేసు పెట్టారని ఆరోపించారు. అతడిని అరెస్టు చేయకముందే తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

# ఒలింపిక్స్‌లో చరిత్ర సృష్టించిన భారత షట్లర్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో పురుషుల సింగిల్స్ సెమీ-ఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయుడిగా లక్ష్య సేన్ నిలిచాడు. శుక్రవారం జరిగిన మూడు గేమ్‌లలో 22 ఏళ్ల యువకుడు ఉన్నత ర్యాంక్ చౌ టియన్ చెన్‌ను అధిగమించాడు. లక్ష్య సేన్ పారిస్‌లో చరిత్రను లిఖించారు. 22 ఏళ్ల షట్లర్ ఒలింపిక్స్‌లో సెమీ ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడు. ప్యారిస్ గేమ్స్‌లో తైవాన్‌కు చెందిన 12వ సీడ్ చౌ టియెన్ చెన్‌ను లక్ష్య ఓడించి సంచలన విజయం సాధించాడు. ఫ్రెంచ్ రాజధానిలో నిండిన బ్యాడ్మింటన్ అరేనాలో భారత ప్రేక్షకులను ఆనందపరిచింది. తన తొలి ఒలింపిక్స్ ప్రదర్శనలో పతకాన్ని నిర్ధారించడానికి లక్ష్య సేన్ ఇప్పుడు ఒక గెలుపు దూరంలో ఉన్నాడు. పారిస్ గేమ్స్‌లో అల్మోరా షట్లర్ భారత బ్యాడ్మింటన్‌పై ఆశలు మోస్తున్నాడు. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో స్వర్ణ పతక పోటీదారులు సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి జోడీ ఓడిపోగా, మహిళల సింగిల్స్ రౌండ్-16లో రెండుసార్లు పతక విజేత పీవీ సింధు జోడీకి తలుపు తట్టింది . లక్ష్య సేన్ 19-21, 21-15, 21-12తో గంటా 15 నిమిషాల్లో చౌ టియెన్ చెన్‌ను ఓడించి మొదటి గేమ్ ఓటమిని అధిగమించి బ్యాడ్మింటన్‌లో సంచలన ప్రదర్శన చేశాడు. అసాధారణ దూకుడుగా ఉన్న 12వ సీడ్ చౌపై అన్‌సీడెడ్ ఆటగాడిగా లక్ష్య అసమానతలతో పోరాడాడు. 16వ రౌండ్‌లో అతని స్వదేశీయుడైన హెచ్‌ఎస్ ప్రణయ్‌పై స్ట్రెయిట్-గేమ్ గెలవడం, లక్ష్య 75 నిమిషాల పోటీ అంతటా తాజాగా ఉంటూ, చిరస్మరణీయమైన విజయాన్ని సాధించడానికి అతని గ్రిట్ రిపోజిటరీలోకి తవ్వడంతో సహాయపడింది. తైవాన్ షట్లర్‌పై ఐదు మీటింగ్‌లలో లక్ష్య తన రెండవ విజయాన్ని మాత్రమే సాధించాడు, అతను వాలియంట్ షో తర్వాత చిత్తు చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో చైనా జోడీ జెంగ్ సి వీ మరియు చైనాకు చెందిన హువాంగ్ యా కియోంగ్‌లు కొరియాకు చెందిన కిమ్ వాన్ హోను ఓడించి పతకాలు సాధించిన తర్వాత పారిస్ ప్రేక్షకులు స్థిరపడటంతో లక్ష్య సేన్ మరియు చౌ టియెన్ చెన్ సుదీర్ఘ ర్యాలీలలో నిమగ్నమయ్యారు. లక్ష్య మరియు చౌ ఇద్దరూ ఒకరినొకరు పోటీపడి ఆడారు. ఓపెనింగ్ గేమ్‌లో సర్వీస్ ఎక్స్ఛేంజ్‌లను ట్రేడ్ చేయడంతో లక్ష్య మరియు చౌ ఒకరికొకరు అంగుళం కూడా ఇవ్వలేదు. ఇది 7-7 వరకు నెక్ అండ్ నెక్‌గా నిలిచిన చౌ ఓపెనింగ్ గేమ్‌లో 11-10తో ఆధిక్యంలోకి వెళ్లాడు. లక్ష్య కంటే 10 ఏళ్లు పెద్దదైన చౌ తన దూకుడు గేమ్‌ప్లేతో భారత షట్లర్‌ను ఆశ్చర్యపరిచాడు. తైవాన్ షట్లర్ ఆ శక్తివంతమైన స్మాష్‌లను



ఆడటానికి లేదా నెట్‌లోకి దూసుకెళ్లి భారతపై ఒత్తిడి తెచ్చేందుకు వెనుకాడలేదు. ఐదో సీడ్ కోడై నారోకాతో జరిగిన రౌండ్ ఆఫ్ 16 మ్యాచ్‌లో చౌ తన పునరుద్ధరించిన విధానాన్ని ఒక సంగ్రహావలోకనం ఇచ్చాడు. చౌ ఛార్జ్‌ను కొనసాగించాడు మరియు ప్రారంభ గేమ్‌లో 14-9తో ముందంజలో ఉన్నాడు, లక్ష్య తన గేమ్‌లో పేస్‌ని ఇంజెక్ట్ చేయాలని మరియు ప్లేస్‌మెంట్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించుకునే ముందు. ట్రోట్‌లో లక్ష్య ఆరు పాయింట్లు గెలుచుకోవడంతో ఈ ఎత్తుగడ అద్భుతాలు సృష్టించింది. లక్ష్య 18-16తో విజయం సాధించి ఆరంభ గేమ్‌లో విజయంపై ఆశలు రేకెత్తించాడు. అయినప్పటికీ, చౌ తన ఆటతీరును పెంచాడు మరియు మొదటి షట్లర్‌ను 21-9తో చేజిక్కించుకున్నాడు. లక్ష్యం ఏకాగ్రతలో డిప్ వెనుక ఉంచుతుంది రెండవ గేమ్‌లో లక్ష్య ఒత్తిడిలో ఉన్నాడు మరియు గేమ్ మధ్యలో చైర్ అంపైర్‌తో వాదించినప్పుడు అతని ఏకాగ్రత దెబ్బతింది. లక్ష్య విస్తృత కాల్‌ని సమీక్షించాలని పిలుపునిచ్చారు, అయితే చౌకి పాయింట్ ఇవ్వడానికి ముందు అతను దానిని పెద్ద స్క్రీన్‌పై చూడలేదు. రివ్యూ పూర్తయినట్లు తనకు తెలియదని భారత షట్లర్ చెబుతూ ఉండటంతో చైర్ అంపైర్ తనను కొనసాగించమని కోరడంతో లక్ష్య ఆశ్చర్యపోయాడు. భారత్ తరపున కోచింగ్ బెంచ్‌లో ఉన్న ప్రకాష్ పదుకొణె, విమల్ కుమార్‌లు శాంతించాలని లక్ష్యాన్ని కోరారు. విశేషమేమిటంటే, మధ్య-గేమ్ విరామం తర్వాత అతను వైదొలిగినందున, 17 నిమిషాల్లో 15-21తో రెండవ గేమ్‌ను గెలుచుకోవడంతో లక్ష్య ఏకాగ్రతలో కొద్దిగా తగ్గుదల అతని గేమ్‌పై ప్రభావం చూపలేదు. డిసైడర్‌లో, చౌ టియన్‌ను పేస్‌ని నిర్దేశించడానికి అతను ఎప్పుడూ అనుమతించనందున లక్ష్య తన సంచలనాత్మక శక్తి రిపోజిటరీతో విరమించుకున్నాడు. మంచి దూకుడు మరియు జాగ్రత్తతో, లక్ష్య మిడ్-గేమ్ విరామంలో 11-7 ఆధిక్యాన్ని సాధించాడు మరియు 21-12 వద్ద సులభంగా గేమ్‌ను ముగించాడు. గ్లోరీ కోసం తాను ఇక్కడ ఉన్నానని ప్రపంచానికి చెబుతూ కెమెరాకు ఎదురుగా భారీ గర్జన చేశాడు లక్ష్య. కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత మరియు ఆల్ ఇంగ్లండ్ మాజీ ఫైనలిస్ట్ అతన్ని ఒలింపిక్ పతకాన్ని గెలుచుకున్న మొదటి భారతీయ వ్యక్తిగా నిలబెట్టాడు. డెన్మార్క్‌కు చెందిన ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ విక్టర్ అక్సెల్‌సెన్ మరియు సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూ మధ్య జరిగే మరో క్వార్టర్-ఫైనల్ మ్యాచ్ విజేతతో అతను తలపడతాడు.

# రెండో వన్డేకు వాన ముప్పు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** శ్రీలంక పర్యటనలో తొలి షాక్ తిన్న భారత జట్టు రెండో వన్డేలో విజయంపై కన్నేసింది. మరోవైపు ఆఖరిదాకా పోరాడిన ఆతిథ్య లంక ఈసారి బోణీ కొట్టాలనే పట్టుదలతో ఉంది. అయితే.. ఆగస్టు 4వ తేదీ ఆదివారం టీమిండియా, లంక మధ్య జరుగబోయే రెండో వన్డేకు వాన ముప్పు పొంచి ఉంది. ప్రేమదాస స్టేడియంలో మ్యాచ్ ఆరంభానికి ముందే వర్షం పడనుందని అక్కడి వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు వాన కురిసే అవకాశం 38 శాతం ఉందని, అదే సాయంత్రం పూట చినుకులు పడేందుకు 41 శాతం నుంచి 63 శాతం అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ వాన కారణంగా రెండో వన్డే రద్దయితే మూడో మ్యాచ్ రసవత్తరంగా సాగనుంది. సిరీస్ విజేత దాంతో, సిరీస్‌లో బోణీ కొట్టేది ఎవరు? అని అభిమానుల్లో ఆసక్తి మొదలైంది.




# రోహిత్ ఖాతాలో మరో రికార్డు

**విశ్వంభర, స్పోర్ట్స్ :** టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ తన హిట్టింగ్ స్టైల్‌తో క్రికెట్‌లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. తనదైన స్టైలిష్ షాట్లు, హిట్టింగ్‌తో ప్రేక్షకులను తెగ అలరిస్తాడు. వీలుచిక్కినప్పుడల్లా బంతిని గ్రౌండ్ బయటకి పంపిస్తుంటాడు. అయితే ఈ దిగ్గజ బ్యాటర్ శ్రీలంకతో జరిగిన తొలి వన్డేలో మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్‌గా వ్యవహరించి అత్యధిక సిక్సర్ల బాదిన బ్యాటర్‌గా రోహిత్ నిలిచాడు. శ్రీలంక జరిగిన మొదటి వన్డేలో ఈ ఫీట్‌ను హిట్ మ్యాన్ టచ్ చేశాడు. 47 బంతులు ఎదుర్కొన్న హిట్‌మ్యాన్ 7 ఫోర్లు, 3 సిక్సర్లు బాది 58 పరుగులు చేశాడు. ఈ క్రమంలో రోహిత్ శర్మ పలు రికార్డును బద్దలు కొట్టాడు.




### అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన కెప్టెన్లు..

అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు సాధించిన కెప్టెన్‌గా రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ రికార్డును బ్రేక్ చేశాడు. కెప్టెన్‌గా మోర్గాన్ 180 ఇన్నింగ్స్‌లలో 233 సిక్సులు బాదగా.. రోహిత్ కేవలం 134 ఇన్నింగ్స్‌లలోనే 234 సిక్స్‌లు కొట్టేశాడు. వీరిద్దరి తరువాత ఎంఎస్ ధోని, రికీ పాంటింగ్‌లు ఉన్నారు.

### ఓపెనర్‌గా 15వేల పరుగులు..

ఓపెనర్‌గా రోహిత్ శర్మ 15వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో వేగంగా 15వేల పరుగులు చేసిన రెండో ఓపెనర్‌గా రికార్డులకు ఎక్కాడు. సచిన్ 331 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనత సాధించగా.. రోహిత్ 352 ఇన్నింగ్స్‌ల్లో అందుకున్నాడు.

# మను భాకర్ ఓటమి.. తృటిలో చేజారిన పతకం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** పారిస్ ఒలింపిక్స్‌లో మనుభాకర్ మరో పతకాన్ని తృటిలో కోల్పోయారు. ఇరవై ఐదు మీటర్ల పిస్టల్ షూటింగ్ ఫైనల్లో ఆమె నాలుగో స్థానంలో నిలిచారు. మొదట్లో ఆమె టాప్ త్రీ పొజిషన్‌లో ఉన్నప్పటికీ చివరిలో ఒత్తిడికి గురవడంతో తక్కువ పాయింట్లు సాధించారు. దీంతో.. నాలుగో స్థానానికి పడిపోయారు. ఇప్పటికే షూటింగ్‌లో రెండు కాంస్య పతకాలను మనుభాకర్ సాధించారు. ఇరవై ఐదు మీటర్ల పిస్టల్ షూటింగ్‌లో దక్షిణ కొరియాకు చెందిన జె.ఐ యంగ్ 37 పాయింట్లతో మొదటి స్థానంలో నిలిచారు. రెండో స్థానంలో ఫ్రాన్స్‌కు చెందిన షూటర్, మూడో స్థానంలో హంగేరీ షూటర్ ఉన్నారు. రేసు చివరి వరకూ రెండో స్థానంలో ఉన్న మనుభాకర్ చివరికి వచ్చే సరికి వెనుకబడిపోయారు. 28 పాయింట్లలో నాలుగో స్థానంతో సరి పెట్టుకున్నారు. మన భాకర్ ఇప్పటికే పది మీటర్ల ఎయిర్ పిస్టల్ పోటీలో కాంస్య పతకం సాధించారు. తర్వాత పది మీటర్ల మిక్స్ డ్ పోటీలో సరబ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి మరో కాంస్య పతకం సాధించారు. ఇరవై ఐదు మీటర్ల పిస్టల్ అంశంలో గట్టిగా పోరాడినప్పటికీ.. నాలుగో స్థానంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. పోటీ పూర్తయ్యే సరికి టాప్ త్రీ పొజిషన్స్ కోసం నలుగురు పోటీలో ఉన్నారు. మను భాకర్ హంగేరీకి చెందిన వెరోనికా మేజర్‌తో 28 పాయింట్లతో సమంగా నిలిచింది. ఐదు-షాట్‌ల షూటాఫ్‌లో, మను భాకర్ రెండుసార్లు గురి తప్పగా, వెరోనికా మేజర్ ఒక్కసారి మాత్రమే గురి తప్పి29 పాయింట్లతో 3స్థానంలో నిలిచి టాప్ 3కి చేరుకుంది. దీంతో మను హ్యాట్రిక్‌ను కోల్పోయి రెండు చారిత్రాత్మక కాంస్య పతకాలతో పారిస్ ఒలింపిక్స్‌ను ముగించింది. షూటింగ్‌లో భారత్ ఇప్పటికే 3 పతకాలను తన ఖాతాలో వేసుకుంది. మను బాకర్ రెండు కాంస్య పతకాలు సాధించగా, స్వప్నిల్ కుశల్ మరో కాంస్య పతకాన్ని సాధించారు. భారత్‌లో రెండు కాంస్యపతకాలు సాధించిన తొలి మహిళగా మను బాకర్ రికార్డు సృష్టించారు.



# 22ఏళ్ల స్విమ్మర్‌కు 4 గోల్డ్ మెడల్స్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** పారిస్ ఒలింపిక్స్‌లో ఫ్రాన్స్‌కు చెందిన ఓ కుర్రాడు సంచలనం సృష్టించాడు. 22ఏళ్ల స్విమ్మర్ లియోన్ మార్చండ్ ప్రస్తుత ఒలింపిక్స్‌లో 4 బంగారు పతకాలు సాధించి ఔరా అనిపించాడు. అందులో రెండు పతకాలు ఒక్క రాత్రిలోనే సాధించి చరిత్ర సృష్టించాడు. 1976 తర్వాత స్విమ్మింగ్‌లో ఒక్క రాత్రిలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన తొలి అథ్లెట్‌గా నిలిచాడు. గురువారం జరిగిన 200మీటర్ల బటర్‌ఫ్లై, 200మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ రెండు వేర్వేరు ఈవెంట్‌లలో 2 స్వర్ణ పతకాలు నెగ్గగా, శుక్రవారం అర్ధరాత్రి 200మీటర్ల ఇండివిజ్యువల్ మెడ్లీలో పసిడి పట్టేశాడు. కాగా, జులై 29న 400మీటర్లు ఇండివిజ్యువల్ మెడ్లీలో నెగ్గి ఫస్ట్ గోల్డ్ మెడల్ ముద్దాడాడు. దీంతో పారిస్ ఒలింపిక్స్‌లోనే లియోన్ ఖాతాలో 4 బంగారు పతకాలు చేరాయి.






# బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్ సిద్ధం

**విశ్వంభర, బిజినెస్ :** కేంద్ర ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ సబ్‌స్క్రైబర్ల పునాది క్రమంగా పెరుగుతున్నదని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ పరిధిలో 4జీ సేవలు అందుబాటులో ఉన్నాయని, దాన్ని 5జీ లోకి కన్వర్ట్ చేసే ప్రక్రియ ప్రారంభమైందని కేంద్ర టెలికం శాఖ మంత్రి సింధియా శనివారం మీడియాతో చెప్పారు. ఆత్మ నిర్భర్ భారత్ ఇన్షియేటివ్ కింద స్వదేశీ టెక్నాలజీతో రూపుదిద్దుకున్న 4జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉందని తెలిపారు. త్వరలో బీఎస్ఎన్ఎల్ ద్వారా 4జీ సేవలు అందరికీ లభిస్తాయన్నారు. 'రిలయన్స్ జియో, భారత్ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా 4జీ నెట్ వర్క్ సేవలు అందుబాటులోకి తెస్తున్నప్పుడు బీఎస్ఎన్ఎల్ లో 4జీ నెట్వర్క్ ఎందుకు తేవడం లేదని పలువురు ప్రశ్నించారు. చైనా, ఏ ఇతర విదేశీ కంపెనీ పరికరాలు వాడకుండా దేశీయంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నెట్ వర్క్ అభివృద్ధి చేయాలని ప్రధాని నిర్ణయం తీసుకున్నారు' అని సింధియా పేర్కొన్నారు. అందుకే స్వదేశీ పరిజ్ఞానంతోనే 4జీ నెట్వర్క్ అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తేజాస్ నెట్ వర్క్, సీ-డాల్, టీసీఎస్ వంటి భారతీయ సంస్థలతో కలిసి దేశవ్యాప్తంగా టవర్ల ఏర్పాటు ప్రక్రియ చేపట్టినట్లు సింధియా తెలిపారు. అక్టోబర్ కల్లా 80 వేలు, మరో 21 వేలు వచ్చే ఏడాది మార్చి కల్లా ఇన్ స్టాల్ చేస్తామని తెలిపారు. 2025 మార్చి కల్లా లక్ష '4జీ నెట్ వర్క్' టవర్లు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

తద్వారా ఇంటర్నెట్ ద్వారా వేగంగా డేటా డౌన్ లోడ్, వాచింగ్ టెలివిజన్ తేలికవుతుం దన్నారు. 4జీ నెట్వర్క్ పరిధిలోనూ 5జీ సేవలు వినియోగించుకోవచ్చునన్నారు. 5జీ సర్వీసుల కోసం టవర్లలో కొన్ని మార్పులు చేపట్టాల్సి ఉందని, త్వరలో ఈ ప్రక్రియ పూర్తవుతుందని వివరించారు.

# పడి లేచిన బంగారం

**విశ్వంభర, బిజినెస్ :** మన దేశంలో బంగారమంటే ఇష్టపడని వారెవ్వరూ ఉండరు. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలను ధరించడానికి చాలా ఆసక్తి చూపుతారు. పండగలు, శుభకార్యాలు, ఇతర ముఖ్యమైన సమయాల్లో బంగారానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. బహుమతులను బంగారం రూపంలో అందజేయడం మన సంప్రదాయం. కాబట్టి దేశంలో బంగారం ధర ఎప్పుడూ పెరుగుతూనే ఉంటుంది. అయితే ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో బంగారంపై దిగుమతి సుంకం తగ్గించిన నేపథ్యంలో దేశంలో బంగారం ధర స్వల్పంగా తగ్గింది. అనంతరం తిరిగి పుంజుకుంది. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. బంగారం, వెండి, ప్లాటినంపై కస్టమ్స్ సుంకాలను తగ్గించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూలై 23న ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ఈ అంశాన్ని చేర్చింది. ఈ ప్రకటన తర్వాత బంగారం ధర స్వల్పంగా తగ్గింది. అనంతరం తిరిగి మళ్లీ పెరుగుతోంది. ఎందుకంటే సుంకం తగ్గింపు ప్రభావం కన్నా సెంట్రల్ బ్యాంక్ కొనుగోళ్లు, భవిష్యత్ ఆర్థిక విధానాలు ఎక్కువ ప్రభావం చూపాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎమ్సీఎక్స్)లో బంగారం ఫ్యూచర్ల ధరలు గణనీయంగా పెరిగాయి. ఆగస్టు రెండో తేదీ నాటికి 10 గ్రాములకు రూ.641 పెరిగి రూ.70,595కి చేరుకుంది. న్యూయార్క్‌లో బంగారం ఫ్యూచర్స్ 1.12 శాతం పెరిగాయి. ఔన్సు రూ.2,508.60కు చేరింది.



### పెరుగుతున్న ధర

బంగారంపై దిగుమతి సుంకం తగ్గితే ధర కూడా తగ్గిపోవాలి. దానికి విరుద్ధంగా పెరగడానికి అనేక కారణాలున్నాయి. సెప్టెంబర్‌లో వడ్డీరేట్ల తగ్గుదల, సెంట్రల్ బ్యాంక్ కొను గోళ్లు, ముఖ్యంగా భౌగోళిక, రాజకీయ పరిస్థితులు దీనికి కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నా రు. ముఖ్యంగా ఆసియాలో అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పాటు ఈటీఎఫ్‌లు, దుకాణాల్లో భౌతిక కొనుగోళ్లు పెరగడం దీనికి కారణమని భావిస్తున్నారు. ప్రస్తుతం పది గ్రాముల బంగారం ధర రూ.71వేల నుంచి రూ.71,700లకు పెరిగిందని, సమీపంలో మరింత పెరుగుతుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# గూఢచారి వస్తున్నాడు


**విశ్వంభర, సినిమా :** అడివి శేష్ హీరోగా నటించిన గూఢచారి అప్పట్లో భారీ విజయాన్ని అందుకుంది. బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షాన్ని కురిపించింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా జీ2 : గూఢచారి2 రెడీ అవుతోంది. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే తాజాగా ఈ మూవీ రిలీజ్ గురించి చిత్రబృందం స్పందించింది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపింది. అంటే సినిమా రావడానికి చాలా సమయం పట్టే అవకాశం ఉంది. కాగా, గూఢచారి కథ భారతదేశంలోనే జరగగా రెండో భాగం అంతర్జాతీయంగా సాగనుంది. ఈ సెకండ్ పార్ట్‌లో కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి కనిపించనున్నారు. ప్రస్తుతం మూవీ షూటింగ్ జరుపుకుంటోంది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ కీలక పాత్ర పోషిస్తున్నాడు. గూఢచారి విడుదలై నేటికి ఆరేళ్లు అవుతుంది. దీంతో తాజాగా గూఢచారి 2 నుంచి ఆరు స్టిల్స్ విడుదల చేశారు.






# హలో బేబీ ట్రైలర్ రిలీజ్

విశ్వంభర, సినిమా : ఎస్ కే ఎమ్ ఎల్ మోషన్ పిక్చర్స్ పతాకంపై కాండ్రేగుల ఆదినారాయణ నిర్మాతగా, రామ్ గోపాల్ రత్నం దర్శకత్వంలో కావ్య కీర్తి సోలో క్యారెక్టర్ గా నటించిన సినిమా హలో బేబీ. ఈ చిత్రంలో కావ్య కీర్తి సోలోగా నటించడం విశేషం. ప్రముఖ హీరో ఆది సాయికుమార్ ఈ చిత్రం ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ.. సోలో క్యారెక్టర్ తో సినిమా తీయడం మెచ్చుకోవాల్సిన అంశం. హ్యాకింగ్ కథతో ఇలాంటి సింగిల్ క్యారెక్టర్ రావడం ఇదే మొదటిసారి. ఈ సినిమా మంచి విజయం సాధించాలి అని అన్నారు. ఈ చిత్రం కచ్చితంగా మంచి హిట్ అవుతుందని హ్యాకింగ్ పై తీస్తున్నటువంటి మొదటి చిత్రంగా దీన్ని జనాలు గుర్తుంచుకుంటారని కొనియాడారు. హలో బేబీ ట్రైలర్ చూస్తుంటే ఒక ఇంట్లో ఒక సాఫ్ట్ వేర్ జాబ్ చేసే అమ్మాయిని ఆమె ఫోన్, ల్యాప్ టాప్ హ్యాక్ చేసి ఎవరు ఏం చేసారు అని థ్రిల్లింగ్ తో తెరకెక్కించినట్టు తెలుస్తుంది. నిర్మాత కాండ్రేగుల ఆదినారాయణ మాట్లాడుతూ.. ''ఈ సినిమా అద్భుతంగా వచ్చింది. త్వరలోనే చిత్ర రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తాం. భారతదేశంలోనే మొట్టమొదటి హ్యాకింగ్ చిత్రంగా ఇప్పటికే పురస్కారనంది, ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫెస్టివల్, దాదా సాహెబ్ అవార్డులు ఈ సినిమాకి రావడంతో మాకెంతో సంతోషంగా ఉంది. ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి గల కారణం కెమెరామెన్ రమణ, ఎడిటర్ సాయిరాం తాటిపల్లి, మ్యూజిక్ డైరెక్టర్ సుకుమార్ పమ్మి, మరియు సింగిల్ పాత్రలో నటించిన హీరోయిన్ కావ్య కీర్తి (Kavya Keerthi). వారంతా ఈ సినిమా కోసం ఎంతగానో కృషి చేశారు. ప్రత్యేకంగా మా డైరెక్టర్ రామ్ గోపాల్ రత్నం చేసిన కృషిని మరువలేను. ఎన్నో మరిచిపోలేని సంఘటనలు ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగాయి. ప్రేక్షకులను అలెర్ట్ చేసే చిత్రంగా ఈ సినిమా ఉంటుంది..'' అని చెప్పుకొచ్చారు.



# మెట్రోలో 'మిస్టర్ బచ్చన్'

**విశ్వంభర, సినిమా :** మాస్ మహారాజ రవితేజ- హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న మూవీ 'మిస్టర్ బచ్చన్'. ఈ సినిమా ఆగస్టు 15వ తేదీన రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్ షురూ చేసింది. అయితే ప్రమోషన్స్లో రవితేజ తన రూటే సపరేటు అని నిరూపించుకున్నాడు. తన మూవీని కాస్త డిఫరెంట్గా ప్రమోట్ చేయాలనుకున్నాడు. ప్రజల్లోకి తన మూవీ త్వరగా వెళ్లాలన్న ఉద్దేశంతో ఏకంగా మెట్రోను తన ప్రమోషన్కు వాడుకున్నాడు. మిస్టర్ బచ్చన్ మూవీటీమ్ హైదరాబాద్ మెట్రో రైల్లో తమ సినిమాను ప్రమోట్ చేసుకుంది. 'మెట్రో ప్రయాణికులకు స్వాగతం సుస్వాగతం. ఏం తమ్ముళ్లు మెట్రోలో ప్లేస్ దొరకలేదా? లేదా కూర్చోగానే లేపేస్తున్నారా? ఏం పర్వాలేదు. మిస్టర్ బచ్చన్ నుంచి లేటెస్టా ఓ పాట రిలీజైంది. హ్యాపీగా వినుకుంటూ మీరు దిగాల్సిన స్టేషన్ వచ్చేదాకా నిల్చొని వెళ్లిపోండి. ఇక్కడ సీట్ దొరక్కపోయినా పర్వాలేదు. ఆగస్టు 15న థియేటర్కు వచ్చేయండి. అక్కడ సీట్ గ్యారెంటీ' అని హీరో రవితేజ వాయిస్ మెసేజ్తో ప్రయాణికులకు సర్ప్రైజ్ ఇచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో బాగా వైరల్ అవుతోంది.

# గొప్ప మనసు చాటుకున్న రష్మిక

**విశ్వంభర, సినిమా :** కష్టం అంటే సాయం అందించడానికి ముందుంటుంది నేషనల్ క్రష్ రష్మిక మందన్న. మరోసారి ఆమె తన పెద్ద మనసు చాటుకుంది. కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ఇటీవల కొండచరియలు విరిగిపడి సృష్టించిన విషాదం పట్ల రష్మిక మందన్న స్పందించారు. ఈ ప్రకృతి విపత్తుకు ఎంతో మంది విగత జీవులయ్యారు. ఇప్పటికే పలువురు సినీ సెలబ్రిటీలు కేరళ వరుద బాధితులకు తమ వంతు సాయం అందిస్తున్నారు. ఈ కోవలో నేషనల్ క్రష్ రష్మిక మందన్న వరద బాధితులకు భారీ విరాళం అందించింది. ఇప్పటికే కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ లో జరిగిన ప్రకృతి విలయానికి ఎంతో మంది కన్నుమూసారు. జాతి యావత్తు కూడా ఈ విపత్తుపై తమ వంతు విచారాన్ని వ్యక్తం చేశారు. తాజాగా రష్మిక కేరళ వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షలను కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేసి తన పెద్ద మనసు చాటుకుంది. ఈ కష్ట సమయంలో కేరళ ప్రజలంతా ధైర్యంగా ఉండాలని ఆమె పేర్కొంది. గతంలో కేరళలో వరదలు సంభవించిన సమయంలో కూడా రష్మిక తనవంతు సాయం అందించారు. ఇప్పటికే కేరళలో సంభవించిన ప్రకృతి విలయానికి కేంద్రానికి చెందిన ఎన్డీఆర్ఎఫ్ బృందం, కేరళలోని ప్రకృతి విపత్తు దళం, ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు రంగంలోకి దిగి బాధితులకు తమ వంతు సాయం అందిస్తున్నారు. ఇప్పటికే మలయాళ చిత్ర పరిశ్రమ ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. అక్కడ నెల రోజుల పటు సినిమాకు సంబంధించిన ఈవెంట్స్ ఏవి నిర్వహించకూడదనే నిర్ణయానికి వచ్చింది. రష్మిక మందన్న ప్యాన్ ఇండియా హీరోయిన్ గా తెలుగు నుంచి తమిళం వయా హిందీ అన్ని భాషల్లో చిత్రాలు చేస్తూ యమ బిజీగా ఉంది. రష్మిక 2020లోనే నేషనల్ క్రష్‌గా ఎంపికై సంచలనం రేపింది. బాలీవుడ్లో బిగ్‌బీతో కలిసి గుడ్ బై మూవీ తొలిసారి హిందీ చిత్ర పరిశ్రమలో ప్రవేశించింది. ఈ ఏడాది యానిమల్ చిత్రంతో సూపర్ సక్సెస్ అందుకున్న ఆమె వరుస చిత్రాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం 'పుష్ప-2' షూటింగ్‌తో బిజీగా ఉంది. దీనితో పాటు 'రెయిన్ బో', 'ద గర్ల్‌ఫ్రెండ్', 'కుబేర', 'సికందర్' చిత్రాలు చేస్తోంది.




# రిలీజ్‌కు సిద్ధమవుతున్న నాగచైతన్య తండేల్



**విశ్వంభర, సినిమా :** సినిమా ఇండస్ట్రీలో ప్రతి సినిమా కూడా ఆశించిన మేరకు విజయాన్ని సాధించాలని ఉద్దేశంతోనే మేకర్స్ వాటి మీద ఎక్కువ శ్రద్ధని తీసుకుంటున్నారు. ఇక ఆ క్రమంలోనే కార్తికేయ 2 సినిమాతో భారీ సక్సెస్‌ని అందుకున్న చందు మొండేటి దర్శకత్వంలో నాగ చైతన్య హీరోగా వస్తున్న తండేల్ సినిమా వేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. ఇక తొందర్లోనే ఈ సినిమా రిలీజ్‌కి రెడీ అవుతున్న నేపథ్యంలో ఈ మూవీకి సంబంధించి డైరెక్టర్ తీసిన ప్రతి సీన్‌ను జగ్రత్తగా చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో నాగచైతన్యకు జోడీగా సాయి పల్లవి నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో వీళ్ళిద్దరి క్యారెక్టర్లు చాలా హైలెట్‌గా నిలవబోతున్నాయంటూ దర్శకుడు ఇప్పటికే చాలాసార్లు క్లారిటీ ఇచ్చారు. ఈ సినిమా ఎలా ఉంటుంది అంటూ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఇక వాళ్ల అంచనాలకు ఏ మాత్రం మించకుండా ఈ సినిమా సూపర్ సక్సెస్ అవ్వాలనే ఉద్దేశ్యంతోనే వాళ్ళు ఈ సినిమాని రూపొందిస్తున్నట్టుగా తెలుస్తుంది. ఇక చందు మొండేటి కూడా మరోసారి పాన్ ఇండియాలో తన స్టామినా ఏంటో ప్రూవ్ చేసుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. ఇక ఇదిలా ఉంటే ఈ సినిమాలో నాగార్జున కూడా ఒక క్యామియో రోల్ పోషించబోతున్నాడనే వార్తలైతే వినిపిస్తున్నాయి. ఇక నాగార్జున ప్రస్తుతం తన సినిమా స్టైల్‌ని మార్చినట్టుగా తెలుస్తుంది. ఏదైనా ఇంపార్టెంట్ క్యారెక్టర్ ఉంటే వేరే హీరోల సినిమాల్లో కూడా నటించడానికి తను సిద్ధమవుతున్నాడు. ఇక నాగ చైతన్య తన కొడుకే కాబట్టి ఒక ఇంపార్టెంట్ క్యారెక్టర్‌లో తను నటించి ప్రేక్షకుల చేత శభాష్ అనిపించుకునే ప్రయత్నంలో ఉన్నాడు.

# గోపీచంద్ జర్నీ ఆఫ్ విశ్వం

**విశ్వంభర, సినిమా:** స్టార్ హీరో గోపీచంద్ నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వం' ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు శ్రీను వైట్ల తెరకెక్కిస్తుండటంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమా నుంచి రిలీజైన వీడియో గ్లింప్స్ ఈ సినిమాపై అంచనాలను పెంచింది. ఇప్పుడు తాజాగా ఈ సినిమా నుంచి 'జర్నీ ఆఫ్ విశ్వం' అంటూ మరో వీడియోను విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన సీన్స్‌తో పాటు సినిమాలోని యాక్షన్ సీన్స్‌ని కూడా మనకు 'జర్నీ ఆఫ్ విశ్వం'లో చూపెట్టారు. ఈ వీడియో చూస్తుంటే, శ్రీను వైట్ల ఈసారి ఎలాగైనా హిట్ కొట్టేందుకు తీవ్రంగా కష్టపడ్డట్లుగా కనిపిస్తుంది. ఈ సినిమాలో యాక్షన్‌తో పాటు కామెడీకి ఏమాత్రం కొదువ లేదని ఈ వీడియో చూస్తుంటే అర్థమవుతోంది. శ్రీను వైట్ల తనదైన మార్క్ కామెడీతో ఈసారి ప్రేక్షకులను అలరించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రంలో అందాల భామ కావ్య తాపర్ హీరోయిన్‌గా నటిస్తోండగా చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టిజి.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.






# ఏబీసీడీ వర్గీకరణ అమలుపై అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం

## జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

**విశ్వంభర, బేగంపేట:** బేగంపేట్ లోని టూరిజం ప్లాజాలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణపై శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహతో కలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించారు.. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఏబీసీడీ వర్గీకరణ అమలుపై అన్ని రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని.. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతోన్న ఉద్యోగ నియామకాల ప్రక్రియలో కూడా మాదిగ, మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు చర్యలు చేపడుతామని, అవసరమైతే ఆర్డినెన్స్ తీసుకోస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రకటించారని అన్నారు.ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం గారు చేసిన కృషి మరియు వారు ఇచ్చిన మద్దతుకు ధన్యవాదాలు తెలియజేశారు.. రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రజా ప్రభుత్వంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించి న్యాయం చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు..ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును క్షుణ్ణంగా పరిశీలించి అధ్యయనం చేసి దానిని వందకు వంద శాతం అమలు చేయడానికి ఒక రోడ్డు మ్యాప్ తయారు చేయాలని, దశాబ్దాల సమస్యకు ఒక రూపు తీసుకొచ్చి పరిపూర్ణం చేయాలని అన్నారు..ఆదిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు..ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ గారు, ఎమ్మెల్యేలు మందుల సామేల్ గారు, కవ్వంపల్లి సత్యనారాయణ గారు, వేముల వీరేశం గారు, కాలే యాదయ్య గారు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ గారు మరియు మాదిగ సామాజికవర్గానికి చెందిన మేధావులు MRPS రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య మాదిగ, పిడమర్తి రవి, సతీష్ మాదిగ, చారకొండ వెంకటేష్, రాజమౌళి, పులిజాల గెలువయ్య,మల్లెపోగు శ్రీనివాస్ మంచాల యాదగిరి, మేడి రమణ, బాబు రావు సరే. బోడ రవి కిరణ్, రాజు, సంజయ్, కృష్ణ,బోట్ల శంకర్, గోవర్ధన్, ఎల్లప్ప పాల్గొన్నారు..




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com